

మంత్రులకు..ర్యాంకులు

మంత్రుల పనితీరుకే కాదు.. ఫైల్స్ క్లియరెన్స్‌కు ర్యాంకులు ఉంటాయి.. తాజాగా ఆ ర్యాంకులను కేటాయించారు. ఇటీవల సీఎం చంద్రబాబు రాష్ట్ర మంత్రులు తమ శాఖల పరిధిలో ఫైళ్లను ఎప్పటికప్పుడు వేగంగా పరిష్కరించాలని దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు గురువారం జరిగిన కేబినేట్ సమావేశంలో దీనిపై చర్చించారు. అనంతరం ఫైళ్ల క్లియరెన్స్‌లో మంత్రుల పనితీరు ఎలా ఉందనేదానిపై సీఎం ర్యాంకులు ప్రకటించారు. అందులో భాగంగా తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కందుల దురేష్ రెండో ర్యాంకులో నిలిచారు.. ఇక కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పదో ర్యాంకు.. బీఆర్ అంబేడ్కర్ జిల్లా రామచంద్రపురం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న వాసంశెట్టి సుభాష్ 25 ర్యాంకులో నిలిచారు. ఈ ర్యాంకులను కేబినెట్ సమావేశంలో సీఎం చంద్ర బాబునాయుడు స్వయంగా ప్రకటించడం గమనార్హం.

మంత్రి దుర్గేష్



రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి) : ఫైళ్ల క్లియరెన్స్‌లో తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌కు 2వ ర్యాంకు లభించింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంత్రులుగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఏ మంత్రి ఎన్ని ఫైళ్ల క్లియర్ చేశారనే దానిపై సీఎం చంద్రబాబు ర్యాంక్‌లు ప్రకటించారు. అందులో మంత్రి కందుల దుర్గేష్‌కు 2వ ర్యాంకు లభించింది. రెండో ర్యాంకు సాధించిన మంత్రి దుర్గేష్ సుమారు 120 ఫైళ్లు క్లియర్ చేసినట్టు చెప్పారు. దీనిపై ఆయనను సంప్రదించగా తాను పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖలకు సంబంధించిన ఫైళ్లను క్లియర్ చేశానని, అందులో టూరిజం శాఖకు చెందినవే అధికంగా ఉన్నాయన్నారు. మరింత ఉత్సాహంగా పనిచేయడానికి ఈ ర్యాంకు ప్రోత్సహిస్తుందని చెప్పారు.

పవన్‌కల్యాణ్



కాకినాడ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : జనసేన అధినేత, డిప్యూటీ సీఎం, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి కొణిదల పవన్‌కల్యాణ్ ఫైళ్ల క్లియరెన్స్‌లో 10వ ర్యాంకులో నిలిచారు. పవన్‌కల్యాణ్ కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మంత్రుల ఫైళ్ల క్లియరెన్స్‌పై సీఎం ర్యాంకులు ప్రకటించారు. అందులో భాగంగా డిప్యూటీ సీఎం, జిల్లా మంత్రి పవన్ కల్యాణ్ పదో ర్యాంకులో నిలిచారు. ఇకపై మరింత వేగవంతమైన పనితీరు అందించే క్రమంలో మంత్రులు మరింత చురుగ్గా వ్యవహరించాలని సీఎం ఆదేశించారు. పవన్‌కల్యాణ్ అత్యంత కీలకమైన శాఖలు చూస్తున్నారు. వీటికి సంబంధించి ఎప్పటికప్పుడు ఫైళ్లను క్షుణ్ణంగా అధ్యయనం చేసి వాటిని పరిష్కరిస్తున్నారు. అలాగే రాష్ట్రంలో పలుచోట్లకు తరచూ పర్యటిస్తూ బిజీబిజీగా గడుపుతున్నారు. ఈ నేపథ్యంలో ఫైళ్ల క్లియరెన్స్‌కు కాస్త ఆలస్యం అవుతున్నా వాటిని పూర్తిగా అధ్యయనం చేస్తున్నారు.

సుభాష్



అమలాపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నుంచి కార్మికశాఖ మంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తున్న వాసంశెట్టి సుభాష్ ఫైళ్ల క్రియరెన్సులో చివరిస్థానం 25లో నిలిచారు. కోనసీమకు చెందిన మంత్రి సుభాష్ ఫైళ్ల పరిష్కారంలో చివరిస్థానంలో ఉండడంతో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే పార్టీ సభ్యత్వ నమోదు విషయంలో ఒకసారి అధినేత చంద్రబాబునాయుడుతో మందలింపునకు గురైన విషయం పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో ర్యాంకుల్లో చివరి ర్యాంకు రావడంతో మంత్రి సుభాష్ రాగల రోజుల్లో మరింత కష్టించి పనిచేయాల్సి ఉంటుందని ఆయన సన్నిహితులు సూచనలు చేస్తున్నారు. సుభాష్ పనితీరు పట్ల కొన్ని వర్గాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం.



అవినీతి.. రత్నాలు!

గత ప్రభుత్వంలో ఆలయాలు దోచుకోవడానికి అడ్డాలుగా మారిపోయాయి.. దాదాపు అన్ని దేవస్థానాల్లోనూ అవినీతి.. అక్రమాలు రాజ్యమేలాయి.. అన్నవరం సత్యదేవుడి ఆలయంలోనూ అసత్యం రాజ్యమేలింది.. విజిలెన్స్ అధికారులు ఆలయంలో అక్రమాలు.. అవినీతి జరిగిందని నివేదిక ఇచ్చినా కూటమి ప్రభుత్వంలోనూ ఇంతవరకు చర్యల్లేవ్. అన్నవరం దేవస్థానం ఎంతో ప్రఖ్యాతి చెందింది. ఏళ్లు గడుస్తున్నా ఆలయంలో అక్రమార్కులపై కనీస చర్యలు లేకపోవడంతో దొంగలంతా దర్జాగా వ్యవహరిస్తున్నారు. కొండపై ప్రక్షాళన వట్టిమాటే అన్నట్టు ధీమా ప్రదర్శిస్తూ చక్రం తిప్పుతున్నారు.

రత్నగిరి కొండపై అక్రమాలకు అడ్డేది

- అన్నవరంలో అక్రమాలపై నివేదిక
- గత ప్రభుత్వంలో విజిలెన్స్ దాడులు
- నిధులు దుర్వినియోగంపై తేల్చివేత
- గొంది ఆలయ భూముల కబ్జా
- 38 ఎకరాలపై విన్నపం
- ఏళ్లు గడుస్తున్నా మౌనమే
- కూటమిలోనూ అక్రమార్కుల దర్జా
- విజిలెన్స్ నివేదికపై నేటికీ చర్యల్లేవ్
- ఈ సర్కారులోనూ ఇంతేనా?
- ఇప్పటికీ చక్రం తిప్పుతున్నవైనం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

అన్నవరం దేవస్థానంలో అవినీతి గుట్టు బయటపడినా అక్రమార్కులపై ఇప్పటికీ చర్యలకు అడుగులు పడడంలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో కచ్చితంగా చర్యలు ఉంటాయని భావించినా ఇంకా ఆ దిశగా ప్రక్షాళన జరగకపోవడం చర్చనీయాంశంగా మారింది. కొండపై పలు రకాల అవినీతి, అక్రమాలు పేరుకుపోయాయని సాక్షాత్తూ ఆధారాలతో విజిలెన్స్ నివేదిక తయారుచేసి పంపినా గత వైసీపీ ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదు. పైగా ఇవన్నీ బయటపడితే కొలువులు పోతాయని కొందరు కీలక అధికారులు బెంబేలెత్తిపోయారు. అక్రమాలపై చర్యలు లేకుండా అప్పట్లో తెగ చక్రంతిప్పారు. అయితే కూటమి ప్రభుత్వం రావడంతో విజిలెన్స్ నివేదిక ప్రకారం చర్యలు ఉంటాయని భావిస్తే ఇప్పటికీ సదరు అక్రమార్కులు ఆ నివేదిక బయటకు రాకుండా ప్రభుత్వం కళ్లకు గంతలు కట్టడానికి ప్రయత్నిస్తుండడం విశేషం. మరోపక్క అప్పటి నివేదికలను విజిలెన్స్ అధికారులు కొత్త కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. కానీ ఇప్పటికీ అక్రమార్కులపై చర్యలకు దిగిన ఆనవాళ్లు లేవు. వాస్తవానికి కొండపై అడ్డగోలుగా ఉద్యోగుల భర్తీ, పదోన్నతులు, దుకాణాల లీజులు, ఈవో బంగ్లా నిర్మాణం వరకు పలు రకాలుగా అక్రమాలు, అవినీతి జరిగినట్టు విజిలెన్స్ తేల్చింది.

ఇన్నేళ్లయినా.. చర్యలేవి!

అన్నవరం దేవస్థానంలో 2019 నుంచి పలు విభాగాల్లో అక్రమాలు భారీగా చోటుచేసుకున్నాయి. ఓ కీలక అధికారి, కొందరు సెక్షన్ ఉద్యోగులతో కుమ్మక్కై అర్చకులు, ఉద్యోగాల నియామకాల్లో పెద్దఎత్తున మేసేశారు. జీతాల పేరుతో దేవస్థానం నిధులను దిగమింగేశారు. బస్సుల నిర్వహణ, కొండ కింద ఈవో బంగ్లా నిర్మాణానికి దేవస్థానం నిధుల నుంచి రూ.కోటి వరకు వెచ్చించారు. గోశాల నిర్వహణలో సైతం అక్రమాలు భారీగా ఉన్నాయి. అడిగేవారు లేరన్న ధీమాతో అప్పట్లో కొందరు అధికారులు, ఉద్యోగులు కలిసి దేవస్థానం సొమ్ములు మింగేశారు. వీటన్నింటిపైనా భక్తుల నుంచి 2021లో అప్పటి ప్రభుత్వానికి భారీగా ఫిర్యాదులు వెళ్లాయి. ఈ నేపథ్యంలో కొండపై అవినీతి బాగోతం తేల్చడానికి ముఖ్యమంత్రి కార్యాలయం ఆదేశాలతో విజిలెన్స్ అధికారులు రంగంలో దిగారు. 2021 డిసెంబరు 20 నుంచి విజిలెన్స్ ఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు కొండపై కొన్నిరోజులు దాడులు నిర్వహించాయి. ట్రాన్స్‌పోర్టు, ఉద్యోగుల భర్తీకి సంబంధించి సెక్షన్లలో కీలక అధికారులు, ఉద్యోగుల నుంచి వివరణలు రికార్డు చేసుకున్నారు. దేవస్థానంలో అక్రమ నియామకాలు, పదోన్నతులు, లీజుల విభాగంలో అక్రమాలు, ఈవో క్వార్టర్ నిర్మాణంలో భారీగా ఆలయ నిధులు మింగేశారనే అంశాలపైనా విచారణ చేపట్టారు. ఈ ఖర్చులకు సంబంధించిన బిల్లులు, ఇతర రికార్డులను విజిలెన్స్ పరిశీలించింది. దేవస్థానానికి సమీపంలో నిర్మాణంలో ఉన్న కొన్ని భవనాల కొలతలు తీసుకున్నారు. ఆ తర్వాత ప్రభుత్వానికి 2022లో విజిలెన్స్ పూర్తి నివేదిక పంపింది. కొండపై అనేక అవినీతి, అక్రమాలు జరిగినట్టు తేల్చింది. రౌతులపూడి మండలం గొందిలో ఆలయానికి 38 ఎకరాల భూమి ఉండగా దానిలో చాలా వరకు అక్రమార్కులు పాగా వేసేశారని దీనికి కొందరు అధికారుల సహకారం ఉందని వివరించింది. బాధ్యులందరిపై చర్యలు తీసుకోవాలని పేర్కొంది. ఈ నివేదికపై చర్యలు తీసుకుంటే కొలువు పోతుందనే భయంతో ఇక్కడ ఈవోగా పనిచేసి వెళ్లిపోయిన సదరు కీలక అధికారి విజిలెన్స్ నివేదికపై చర్యలు లేకుండా అప్పటి ప్రభుత్వ పెద్దలను దారికి తెచ్చుకున్నారు. దీంతో అక్రమాలు బయటపడినా నివేదికను తొక్కి పెట్టేసేలా చేయగలిగారు. ప్రభుత్వం నుంచీ ఏ స్పందనా లేకపోవడంతో విజిలెన్స్ సైతం పట్టువదిలేసింది.

ఇప్పుడూ అంతే.. చర్యల్లేవంతే..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చి ఏడు నెలలుపైగానే అయిపోయింది. అయినా ఇప్పటికీ అక్రమార్కులపై చర్యలు లేవు. వాస్తవానికి ప్రభుత్వం వచ్చిన కొత్తలో విజిలెన్స్ అధికారులు గత ప్రభుత్వంలో అక్రమాలకు సంబంధించి అన్ని వివరాలు అందించారు. అయినా ఇప్పటికీ అక్రమార్కులపై చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. కూటమి ప్రభుత్వంలోను సదరు కీలక అధికారి చక్రం తిప్పుతున్నారనే అనుమానాలున్నాయి. ప్రత్తిపాడు, తుని ఎమ్మెల్యేలు అసెంబ్లీలో అన్నవరం దేవస్థానం అక్రమాలపై విజిలెన్స్ నివేదికలు ఏమయ్యాయని నిలదీసి ఉంటే ఈపాటికి చర్యలకు అవకాశం ఉండేది. కానీ ఈ దిశగా ప్రయత్నాలు లేకపోవడంతో దొంగలు కొండపై తమ దందాలు సాగిస్తున్నారు. విజిలెన్స్ నివేదికను రప్పించుకుని అక్రమార్కులపై చర్యలు తీసుకునేలా కలెక్టర్ అయినా చొరవ తీసుకోవాల్సి ఉంది.



కాకినాడలో గురువారం ఎమ్మెల్యేలు, కూటమి నాయకులతో సమావేశమైన మంత్రి నారాయణ

ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించుకోవాలి

ఎమ్మెల్యేలతో ఇన్‌చార్జి మంత్రి నారాయణ భేటీ.. ఎన్నికలపై దిశానిర్దేశం

కాకినాడ సిటీ, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): కాకినాడ విద్యుత్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ అతిథి గృహంలో గురువారం రాత్రి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగూరి నారాయణ జిల్లా ఎమ్మెల్యేలు, కూటమి నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలన్నారు. ఇందుకుగాను ప్రతి నియోజకవర్గంలో బూత్ స్థాయి నుంచి తగిన ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నందున ఎమ్మెల్యేలు, పరిశీలకులు, నాయకులు చాలా పట్టుదలతో పనిచేయాలన్నారు. పట్టభద్ర ఓటర్లను కలిసి కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ, వనమాడి కొండబాబు, పంతం నానాజీ, వరుపుల సత్యప్రభ, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, కౌడా చైర్మన్ తుమ్మల బాబు, ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్, మాజీ మేయర్ సుంకర పావని, పిఠాపురం జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్, నాయకులు పెంకే శ్రీనివాసబాబా, కుడిపూడి సత్తిబాబు, వాసిరెడ్డి ఏసుదాసు, కటకంశెట్టి ప్రభాకర్, మెట్ల రమణబాబు, బోళ్ల వెంకట రమణ, పీలా గోవింద్, దేశంశెట్టి లక్ష్మీనారాయణ, సాయికృష్ణ, గొంప కృష్ణ తదితర నాయకులు పాల్గొన్నారు.



బీచ్ అభివృద్ధి పనులపై చర్చిస్తున్న కలెక్టర్

ఎన్టీఆర్ బీచ్ సుందరీకరణకు చర్యలు

పర్యాటకశాఖ అధికారులతో కలెక్టర్ బీచ్ సందర్శన

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పర్యాటకులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేలా ఎన్టీఆర్ బీచ్‌ను సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేయనున్నట్టు కలెక్టర్ సగిలి షాన్‌మోహన్ అన్నారు. గురువారం కాకినాడ రూరల్ సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌ను పర్యాటకశాఖ, కౌడా, రెవెన్యూ, ఇంజనీరింగ్ అధికారులతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా బీచ్‌లో జరుగుతోన్న అభివృద్ధి పనులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఉమ్మడి జిల్లాలోనే ప్రముఖ పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందిన ఎన్టీఆర్ బీచ్‌ను మరింత అభివృద్ధికి చర్యలు తీసుకుంటునానమన్నారు. బీచ్ పరిసరాల పరిశుభ్రత, పర్యావరణానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. బీచ్‌లో క్రమపద్ధతి లేకుండా ఇష్టారాజ్యంగా ఏర్పాటుచేసిన పలు కంటైనర్ దుకాణాలపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. వీటికి ఎవరు అనుమతులిచ్చారని అధికారులను ప్రశ్నించారు. ఆర్డీవో ఎస్.మల్లిబాబు, ఎంపీడీవో పసుపులేటి సతీష్, పర్యాటకశాఖ అసిస్టెంట్ ఆఫీసర్ త్రిమూర్తులు, ఏఈ వెంకటేష్ ఈవోపీఆర్డీ శ్రీరామంజనేయులు, కౌడా డీఈ రామారావు, మునలయ్య, సూరాడ రాజు పాల్గొన్నారు.



గుండెపోటు లక్షణాలపై అవగాహన కల్పించే గోడ పత్రికను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

గుండెపోటు బాధితులకు అందుబాటులో ఇంజక్షన్లు

జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): గుండెపోటు బాధితులకు జిల్లాలోని అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో అత్యవసర వైద్యం అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. గుండెపోటు లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించే లక్ష్యంతో రూపొందించిన గోడపత్రికను గురువారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్‌తోపాటు జిల్లా వైద్యశాల సమన్వయకర్త డాక్టర్ స్వప్నతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుని ఏరియా ఆసుపత్రితోపాటు జిల్లాలో ఉన్న తొమ్మిది సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో గుండెపోటు బాధితులకు అందించే ఇంజక్షన్ అందుబాటులో ఉందన్నారు. గుండెనొప్పికి గురైన వారికి హబ్ అండ్ స్ట్రోక్ విధానంలో రూ.40వేల ఖరీదైన ఇంజక్షన్‌ను ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా అందిస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 82 మందికి ఈ ఇంజక్షన్ అందించామని తెలిపారు.



ఎండలో మాస్క్‌తో వెళుతూ..



మంచుతో రాత్రి వాతావరణం

పగలు వేడి.. రాత్రి చలి..

ఫిబ్రవరి మొదటి వారంలోనే ముదిరిన ఎండలు

కార్పొరేషన్(కాకినాడ)/కొత్తపల్లి, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రెండు వారాలుగా విభిన్న వాతావరణం కనిపిస్తోంది. పగలు ఎండ మండుతుండగా, రాత్రిళ్లు చలి పంజా విసురుతోంది. సాయంత్రం 5 గంటల వరకు కూడా ఎండ తీవ్రత కనిపిస్తోంది. రాత్రి 8 దాటక ముందే చలి తీవ్రత పెరుగుతోంది. ఫిబ్రవరి మొదటి వారంలోనే పగటి గరిష్ఠ ఉష్ణోగ్రత 35 డిగ్రీలకు చేరింది. ఇప్పటికే తెల్లవారుజామున ఎక్కువగా పొగమంచు కమ్ముకుంటోంది. అలాగే రానున్న నాలుగు రోజులపాటు పొగమంచు కురిసే అవకాశముందని వాతావరణశాఖ నిపుణులు పేర్కొన్నారు. గాలుల దిశల మార్పు వల్ల ఈ నెలలో ఒకవారం చల్లగా, మరోవారం వేడిగా ఉండే అవకాశముందని వాతావరణ శాఖ కేంద్రం తెలిపింది. మార్చి నుంచి అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని పేర్కొంది. అయితే సీజన్ మారుతున్న తరుణంలో ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. వారం రోజులుగా వాతావరణ మార్పులతో చలిగాలులతో చిన్నా, పెద్దా తేడా లేకుండా ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు.

జీజీహెచ్ అభివృద్ధికి ప్రణాళికతో పనిచేయాలి : కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి అభివృద్ధికి ప్రణాళిక ప్రకారం పనిచేయాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ వైద్య అధికారులను ఆదేశించారు. గురువారం కాకినాడ కలెక్టరేట్‌లో జీజీహెచ్ వైద్య అధికారులు, ఆరోగ్యశ్రీ, ఇతర విభాగాల అధికారులతో గత నెలలో జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో తీర్మానించిన అంశాల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందిస్తున్న ఆరోగ్య వైద్య సేవలను మరింత మెరుగుపరచాలన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు వైద్య అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. అందుబాటులో ఉన్న నిధులను దృష్టిలో ఉంచుకుని ఆసుపత్రిలోని మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. సమావేశంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త రాధాకృష్ణ, జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ శ్రీధర్ పాల్గొన్నారు.



కాకినాడ జీజీహెచ్ అభివృద్ధిపై సమీక్షిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

8న కుంభమేళాకు ప్రత్యేక రైలు

ఫలించిన ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ కృషి

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ ప్రత్యేక కృషితో రైల్వే శాఖ కాకినాడ నుంచి కుంభమేళాకు మరో ప్రత్యేక రైలును ఏర్పాటుచేసింది. గతంలో రైల్వే శాఖ ఫిబ్రవరి 20న కాకినాడ నుంచి ప్రయాగరాజ్‌కు ఏసీ బోగీలతో ప్రత్యేక రైలు ఏర్పాటుచేసింది. అయితే భక్తుల నుంచి వస్తున్న డిమాండ్ దృష్టిలో ఉంచుకుని ఏసీతోపాటు స్లీపర్‌క్లాస్ బోగీలతో అదనంగా మరో ప్రత్యేక రైలు ఏర్పాటు చేయాలని ఉదయ్‌శ్రీనివాస్ జనవరి 20న కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు లేఖ రాశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కేంద్ర రైల్వే శాఖ ఫిబ్రవరి 8న మరో రైలును ఏర్పాటుచేసింది. ఈ రైలు కాకినాడలో ఫిబ్రవరి 8న మధ్యాహ్నం 2.30 గంటలకు బయలుదేరి రెండు రోజుల తర్వాత ప్రయాగ్‌రాజ్‌కు చేరుకోనుంది.

సమాజ హితం... సందేశాత్మకం

● తాటిపర్తిలో మొదలైన ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు



చిగురు మేఘం నాటికలో ఓ సన్నివేశం

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సమాజంలో జరుగుతున్న పరిణామాలను వివరిస్తూ సందేశాత్మకంగా సాగాయి నాటికలు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలోని అపర్ణా కళాతోరణం బత్తుల మురళీకృష్ణ కళావేదికపై మార్కండేయ నాటక కళా పరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉభయ తెలుగురాష్ట్రాల నాటికల పోటీల్లో తొలిరోజు ప్రదర్శించిన నాటికలు ఆలోచింపజేశాయి. వైద్య రంగంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులను గుంటూరు అమరావతి ఆర్ట్స్ కళాకారులు 'చిగురు మేఘం' నాటిక ద్వారా కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో ఒక కొడుకు భార్యను సైతం వదిలి సొంతూరు వెళ్లిపోవడానికి సిద్ధపడ తాడు. సరైన వైద్యసేవలు అందక తల్లి చనిపోయిందన్న విషయం అతనిలో ఈ మార్పు తీసుకొస్తుంది. డబ్బు సంపాదనే ధ్యేయంగా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, వైద్యులు వ్యవహరిస్తున్న తీరుని ఎండగడుతూనే గ్రామాలకు వైద్యులు తరలిరావడం ద్వారా అందరికీ సకాలంలో వైద్యసేవలు అందుతాయనే సందేశాన్ని ఇచ్చింది. ఈ నాటికను కావూరి సత్యనారాయణ రచించగా ఏపూరి హరిబాబు దర్శకత్వం వహించారు. కుటుంబ వ్యవస్థలో వస్తున్న మార్పులు, అమలులో ఉన్న చట్టాలు దుర్వినియోగమవుతున్న తీరును విశాఖపట్టణం తెలుగు కళాసమితి కళాకారులు ప్రదర్శించిన 'నిశ్శబ్దం నీ ఖరీదెంత' నాటిక ద్వారా వివరించారు. సమాజంలో వివాహేతర సంబంధాలు వివాహ వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్న తీరు, ఆ మాటున కొందరు చేస్తున్న చర్యలు అమాయకులను ఇబ్బందులకు గురిచేస్తున్న విధానాన్ని తెలియజేశారు. పీటీ మాధవ్ రచించిన ఈ నాటికకు చలసాని కృష్ణ ప్రసాద్ దర్శకత్వం వహించారు.

గిరిజనులకు పథకాలు వర్తింపజేయాలి

● టీఎస్ఎఫ్ నాయకుల డిమాండ్ ● 'నన్నయ'లో ముగిసిన గిరిజనోత్సవాలు



వేదికపై నుంచి అభివాదం చేస్తున్న టీఎస్ఎఫ్ నాయకులు

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గిరిజన కుటుంబానికి వర్తింపచేయాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) జాతీయ అధ్యక్షుడు కరంసి అక్కులప్పనాయక్, టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప, రాష్ట్రప్రధాన కార్యదర్శి మూడవత్ విష్ణు నాయక్ కోరారు. టీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నన్నయ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న గిరిజన సాంస్కృతిక మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. టీఎస్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లి భాస్కర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని కోరారు.

కార్యక్రమంలో టీఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీంద్ర నాయక్, మహిళా అధ్యక్షురాలు మధులత, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు నరేష్, రాష్ట్ర నాయకులు హేమలత, రామరాజు, వెంకటేశ్వర్లు నాయక్, రఘునాథ్, రాజశేఖర్, వెంకటేష్, సుమిత్, వినోద్, లోక్యానాయక్, ప్రిన్సిపాల్ పి. విజయనిర్మల, తదితరులు పాల్గొన్నారు.

ధవళగిరిపై .. లక్ష్మీ జనార్దనుడు!



రథానికి రంగులు వేస్తున్న దృశ్యం

● రేపటి నుంచి కల్యాణోత్సవాలు ఆరంభం



ఆలయంలో కొలువుదీరిన స్వామి, అమ్మవార్లు

● ముందుగా 40 అడుగుల రథంపై ఊరేగింపు
● 13న పుష్పోత్సవంతో ముగింపు
● ఒక పక్క ఆధ్యాత్మికత.. మరో పక్క ఆహ్లాదం

ధవళేశ్వరం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం.. రాజమహేంద్రవరం వెళతుంటే మధ్యలో కనిపించే చిన్నగ్రామం.. ఆ గ్రామంలో గోదావరి చెంతనే ఉంది ఒక కొండ.. ఆ కొండపై స్వయంభూగా వెలసిన దేవుడే శ్రీ భూనీళా సమేత లక్ష్మీజనార్దన స్వామి. ఆ కొండపైకి వెళితే అంతా ఆహ్లాదమే .. గోదావరి చూస్తూ.. స్వామిని దర్శనం చేసుకుంటే అంతా మనశ్శాంతి .. చాలా మందికి ఈ స్వామి గురించి అంతగా అవగాహన ఉండదు. ఒకసారి వెళ్లి దర్శించుకుంటే మళ్లీ మళ్లీ దర్శించుకోవాలనిపించేలా స్వామి ప్రతిరూపం ఉంటుంది. ఇదే కొండపై ఆంజనేయస్వామి ఆలయంలో సాక్షాత్తూ శ్రీరామచంద్రుడి పాదముద్రలు ఉన్నాయి. ఈ నెల 8వ తేదీ నుంచి ధవళగిరి లక్ష్మి జనార్దన స్వామి కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. శనివారం రథోత్సవంతో మొదలయ్యే ఉత్సవాలు గురువారం పుష్పోత్సవంతో ముగుస్తాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేస్తున్నారు. మెట్ల మార్గాన్ని రంగులతో, విద్యుద్దీపాలతో తీర్చిదిద్దుతున్నారు. దిగువన రామపాదాల ఘాట్ వరకు తాటాకు పందిళ్లు వేసి మామిడి తోరణాలతో అలంకరిస్తున్నారు. ఈ నెల 3న స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. 4న స్వామి వారి రథానికి పూజలు నిర్వహించి రథం అలంకారాన్ని ప్రారంభించారు. పరిసర గ్రామాల నుంచి స్వామి వారి దర్శనానికి పెద్ద ఎత్తున తరలివచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ అధికారులు, గ్రామపెద్దలు ఏర్పాట్లు చేస్తున్నారు.

● రథోత్సవం ప్రత్యేక ఆకర్షణ

అందంగా ముస్తాబైన భారీ రథంపై స్వామి అమ్మవార్లు ఆశీనులై గ్రామంలో ఊరేగుతూ భక్తుల అభయమిస్తూ సాగే రథోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఆలయం నుంచి పోలీస్ స్టేషన్ వరకు ఉన్న రహదారి గుండా రథం ముందుకు సాగుతుంది. కిక్కిరిసిన భక్తజనం జయజయ ధ్వానాల మధ్య ఇరుకు మార్గంలో వందలాది మంది భక్తులు రథానికి రెండు వైపులా కట్టిన తాళ్లను భక్తి పారవశ్యంతో లాగుతుండగా రథం వయ్యారంగా కదులుతూ ముందుకు సాగడాన్ని కనులారా వీక్షించాల్సిందే. రథంపై ఆశీనులైన స్వామి అమ్మవార్లకు అర్పిస్తున్నట్లుగా భక్తులు అరటిపండ్లను రథం వైపు విసురుతూ తన్మయత్వం పొందుతారు. అన్ని ఆలయాల్లో స్వామి, అమ్మవార్ల కల్యాణం అనంతరం రథంపై ఊరేగిస్తుండగా ఇక్కడ రథోత్సవం తర్వాత రాత్రి కల్యాణోత్సవాన్ని జరుపుకోవడం ప్రత్యేకం. అంతర్వేది కల్యాణోత్సవం తరువాత ధవళేశ్వరం జనార్దనుడి ఉత్సవాలు ఆరంభమవుతాయి.. తరువాత కోరుకొండ నరసింహ స్వామి కల్యాణోత్సవాలు ఆరంభమవుతాయి.

● తొలి తాంబూలం మత్స్యకారులకే

ఉత్సవాల్లో భాగంగా రథాన్ని ముందుకు నడిపించేది.. కదిలించేది మత్స్యకారులే. ముందస్తుగా మత్స్యకార పెద్దలను సత్కరిస్తారు. మత్స్య కారులకు తొలి తాంబూలం ఇచ్చిన తరువాతనే రథోత్సవం ఆరంభిస్తారు. ఇది అనాధిగా వస్తున్న ఆచారం. నేటికీ అదే ఆచారాన్ని కొనసాగిస్తున్నారు. గతంలో రథాన్ని మత్స్యకారులే లాగే వారు. ఇప్పుడు సాధారణ భక్తజనం కూడా లాగుతున్నారు..

● అతి ఎత్తయిన రథం

ఆరు అంతస్తులతో 40 అడుగుల ఎత్తు, 25 అడుగుల వెడల్పు ఉన్న ఈ రథం తెలుగు రాష్ట్రాల్లో అతి ఎత్తయిన రథంగా చెబుతారు. వందల టన్నుల బరువు ఉన్న ఈ రథానికి ఉంచిన ఆరు భారీ చక్రాలను అదుపు చేయడం ద్వారా రథ గమనాన్ని నియంత్రిస్తూ ఉంటారు. రథం దిగువన మధ్య భాగంలో అమర్చిన కప్పి వంటి నిర్మాణంతో భారీ రథాన్ని గాలిలోకి లేచే విధంగా చేసి కావాల్సిన వైపునకు సులభంగా తిప్పుతారు.

● ఉత్సవాల నిర్వహణ

ఈ నెల 8న ఏకాదశి రోజున స్వామి వారికి విశేష అర్చనలు, భక్తులకు దర్శనం. రథ సంప్రోక్షణ, కుంభ నివేదన, రథోత్సవం, ధ్వజారోహణ, అంకురార్పన, రాత్రి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తారు. 9న గరుడ వాహన సేవ, 10న సింహవాహన సేవ, సదస్యం. 11న అశ్వవాహన సేవ, చోర సంవాదం, 12న పూర్ణాహుతి, చక్రస్నానం. చూర్ణోత్సవం, వసంతోత్సవం, ముత్యాల పల్లకీసేవ, 13న ద్వాదశ అర్చనలు, ద్వాదశ ప్రదక్షిణలు, పుష్పోత్సవాలతో ఉత్సవాలు ముగిస్తాయి

● ప్రత్యేక బందోబస్తు

శనివారం ఉదయం నుంచి స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులను నియంత్రించడంతో పాటు మధ్యాహ్నం మూడు గంటకు మొదలయ్యే రథోత్సవానికి భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు దక్షిణ మండలి డీఎస్పీ భవ్యకిషోర్ తెలిపారు. శని, ఆదివారాల్లో సెలవు దినాలు కావడంతో భక్తుల రద్దీ దృష్ట్యా ధవళేశ్వరం సీఐ టి.గణేష్‌తో పాటు కడియం, రాజమహేంద్రవరం సీఐలు, ఎస్ఐలు, సుమారు 50 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించనున్నట్టు తెలిపారు.



రథోత్సవం (ఫైల్)



కొండకు వెళ్లే మెట్ల మార్గం

రారండోయ్.. వేడుక చూద్దాం

● నేడు అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామి దివ్య కల్యాణం ● అర్ధరాత్రి 12:55 గంటలకు ముహూర్తం

అంతర్వేది, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): బుగ్గన చుక్కతో సిగ్గులు ఒలకపోస్తూ రథసప్తమి నాడు పెండ్లి కుమారుడిగా దర్శనమిచ్చిన అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి వారు శుక్రవారం రాత్రి ఉభయ దేవేరులను పరిణయమాడేందుకు సిద్ధమయ్యారు. పంచభూతాల సాక్షిగా అఖండ జన సందోహం నడుమ ప్రతిఏటా మాఘమాసంలో కనుల పండువగా జరిగే శ్రీనారసింహుడి కల్యాణం చూసేందుకు రెండు కళ్లు చాలవు. కోరికలు తీర్చే శ్రీనారసింహుని పరిణయ ఉత్సవాలు పది రోజుల పాటు వైభవంగా జరగనున్నాయి. ఈ ఉత్సవాల్లో కీలకఘట్టమైన కల్యాణోత్సవం శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 12.55 గంటలకు (తెల్లవారితే శనివారం) జరుగుతుంది. అధికారులు ఘనంగా ఏర్పాట్లు చేశారు.



విద్యుత్ దీపాల అలంకరణలో లక్ష్మీనృసింహ స్వామివారి ఆలయం

● వైభవంగా గ్రామోత్సవాలు

కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం నాలుగు గంటలకు అంతర్వేదిపాలెం వాస్తవ్యులు అల్లూరి లక్ష్మీ సూర్యనారాయణరాజు వారిచే నిర్మించిన హంస వాహనంపై స్వామివారికి గ్రామోత్సవం జరిపారు. తొలుత స్వామివారిని అర్చక అలంకరణ చేసిన అనంతరం భక్తులు కొబ్బరికాయలు కొట్టి హారతులు పట్టారు. గ్రామ పురవీధుల్లో స్వామివారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు అర్చక స్వాములు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి ధూపసేవ అనంతరం వైభవంగా ధ్వజారోహణ నిర్వహించారు.సకల దేవతలను ఆహ్వానించడానికి ధ్వజస్తంభం వద్ద అర్చక స్వాముల నేతృత్వంలో ధ్వజారోహణ కార్యక్రమం జరిగింది. గరుత్మంతుడు చిత్రపటాన్ని ధ్వజస్తంభంపై అర్చకులు ఎగురవేశారు. రాత్రి ఎనిమిది గంటలకు కేశవదాసుపాలెం వాస్తవ్యులు గన్నాబత్తుల వెంకట రాజారావు, లక్ష్మీనరసింహస్వామి వారిచే నిర్మితమైన శేష వాహనంపై గ్రామోత్సవం జరిపారు. స్వామివారికి భక్తులు హారతులు పట్టి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామగోపాల రాజాబహదూర్, ఉత్సవ కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, ఎంపీపీ వీరా మల్లి బాబు, వలవల రాంబాబు, మందపాటి వెంకటేశ్వర్లు, వనమాలి మూలాస్వామి, దాసరి వాసు, ఆకన బాబ్జినాయుడు, కొండా కిశోర్, బర్రే శ్రీను, ఉత్సవసేవా కమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



● కల్యాణోత్సవాల్లో భాగంగా నేడు..

స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 4.30 గంటల నుంచి 5 గంటల వరకు సుప్రభాత సేవ, ఏడుగంటలకు ఆర్జిత అభిషేకం, అనంతరం సాధారణ ప్రత్యేక దర్శనాలు, సాయంత్రం నాలుగు గంటలకు పంచముఖ ఆంజనేయ స్వామి వాహనం, రాత్రి 8.30 గంటలకు కంచుగరుడ వాహనాలపై స్వామివారి గ్రామోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.

● సర్వం సిద్ధం : ఎస్పీ కృష్ణారావు

స్వామివారి దివ్య కల్యాణోత్సవాల సందర్భంగా బందోబస్తు పరంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ బీ. కృష్ణారావు తెలిపారు. స్వామివారి కల్యాణ మండపం వద్ద గురువారం బందోబస్తుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ కల్యాణం, రథోత్సవం, చక్రస్నానం, తెప్పోత్సవాలకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటుచేశామన్నారు.. 1600 మంది పోలీసులు శాంతి భద్రతల పరిరక్షణకు స్వామివారి తిరునాళ్ల కోసం కేటాయించామన్నారు. తొమ్మిది విభాగాలుగా కేటాయిస్తూ ఒక ఎస్పీ, ఒక ఏఎస్పీ, 10 మంది డీఎస్పీలు, 40 మంది సీఐలు, 100 మంది ఎస్ఐలు ముఖ్య ఘట్టాల వద్ద విధులు నిర్వహిస్తారు. వన్‌వే రూట్‌ను ప్రతీఒక్కరూ ఫాలో అయ్యేలా పూర్తిస్థాయి భద్రతా చర్యలు ఏర్పాటు చేశామన్నారు. అంతర్వేది పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఆలయ పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. 20 డ్రోన్ కెమెరాల పర్యవేక్షణతో పాటు వంద సీసీ కెమెరాలు తీర్థ మహోత్సవాల్లో ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ రూములో పర్యవేక్షిస్తున్నామన్నారు. కల్యాణోత్సవానికి వచ్చే భక్తులు సూచిక బోర్డులు ఫాలో అవుతూ కల్యాణ టికెట్ తీసుకుని వారికి కేటాయించిన బ్లాక్‌లో కూర్చొని స్వామివారి కల్యాణాన్ని తిలకించాలన్నారు. కల్యాణోత్సవం, వాహన సేవలు, రథోత్సవంలో బారికేడ్లు ఏర్పాటు చేసి ఎటువంటి తొక్కిసలాట జరగకుండా పూర్తిస్థాయి భద్రతా చర్యలు ఏర్పాటు చేశామన్నారు. ఎన్డీఆర్ఎఫ్, స్పెషల్ పార్టీ, మెరైన్ పార్టీలో తీర్థ మహోత్సవాలతో పాటు బీచ్, స్నాన ఘట్టాల వద్ద బందోబస్తు సిద్ధం చేశామని తెలిపారు. తీర్థ మహోత్సవాలకు వచ్చే భక్తులు ఒరిజినల్ పాస్‌లు మాత్రమే చూపించాలని, డూప్లికేట్ పాస్‌లు చూపించినా, వాడిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అల్లవరం నుంచి స్వామివారి గజమాల యాత్రగా అంతర్వేది ఆలయానికి వచ్చే భక్తులకు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

కార్యక్రమంలో కొత్తపేట డీఎస్పీ ఎస్.మురళీమోహన్, రాజోలు సీఐ నరేష్ కుమార్, ఎస్ఐ కె.దుర్గాశ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



ముస్తాబైన స్వామివారి కల్యాణ మండప ప్రధాన రహదారి



ఉత్సవ ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణారావు

రాష్ట్రస్థాయి యూత్ బాస్కెట్‌బాల్ పోటీలకు

తూర్పుగోదావరి జిల్లా జట్ల ఎంపిక





ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బాలురు, బాలికల జట్టు

రామచంద్రపురం (ద్రాక్షారామ),ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో ఈనెల 8 నుంచి 11 వరకు జరుగనున్న రాష్ట్ర స్థాయి యూత్ బాస్కెట్‌బాల్ బాలబాలికల చాంపియన్ షిప్ పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలురు, బాలికల జట్లను ఎంపిక చేశారు. గురువారం స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో నిర్వహించారు. బాలురు, బాలికల విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనే క్రీడాకారులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి, ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు, రామచంద్రాపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూకే అభివృద్ధిలో విశ్రాంత ఉద్యోగుల పాత్ర మరువలేనిది

● ఇన్‌చార్జి ఉప కులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ



జేఎన్టీయూకే వీసీ మురళీకృష్ణతో విశ్రాంత ఉద్యోగులు

జేఎన్టీయూకే, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ అభివృద్ధిలో విశ్రాంత ఉద్యోగుల పాత్ర మరువలేనిదని ఇన్‌చార్జి ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. వర్శిటీలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విశ్రాంత అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందిని వీసీ సత్కరించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు డాక్టర్ పి.విజయ కుమార్ అధ్యక్షత వహించగా సంయుక్త కార్యదర్శి పి.రామారావు, గంగాధర శాస్త్రి, రఘురాం, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సెమీ ఫైనల్స్‌కి లాన్ టెన్నిస్ పోటీలు

కాకినాడ అర్బన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గోదావరి ఆంధ్రప్రదేశ్ లాన్ టెన్నిస్ అసోసియేషన్, ఐటా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆలిండియా అండర్-16 లాన్ టెన్నిస్ పోటీలు గురువారం సెమీఫైనల్స్ దశకు చేరుకున్నాయి. బాలుర విభాగంలో ధ్రువ్ (తమిళనాడు)పై భువన్ (ఏపీ) 6-0 6-1, విన్సెంట్ (ఏపీ)పై తనీష్ (తెలంగాణ) 6-2 6-3 స్కోర్లతో గెలుపొందారు. బాలికల విభాగంలో గౌరిశ్రీ (తెలంగాణ)పై జోషిత (ఏపీ) 6-4, 5-7, 6-4, జోహా (తెలంగాణ)పై సవర్ణిక (తెలంగాణ) 6-3, 6-4 స్కోర్లతో విజయం సాధించారు.

పోటీలను లాన్ టెన్నిస్ సంఘ రాష్ట్ర కార్యదర్శి పీవీ రామ్‌కుమార్, చీఫ్ రిఫరీ శివ కుమార్ పర్యవేక్షించారు.

అదుపు తప్పిన మోటారుసైకిల్

డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి



గోకవరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలంలోని కొత్తపల్లి రోడ్డులో గురువారం ఓ మోటారుసైకిల్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ఒక యువకుడు మృతి చెందాడు. కాకినాడ జిల్లా అన్నవరం సమీపంలోని బెండపూడికి చెందిన గోసాల సతీష్(17) తన స్నేహితులతో కలిసి గోకవరం మండలం కొత్తపల్లి గ్రామంలోని అమ్మమ్మ ఇంటికి నాలుగురోజుల కిందట వచ్చాడు. ఈ నేపథ్యంలో గురువారం స్నేహితులతో కలిసి మోటార్‌సైకిల్‌పై వెళ్తున్నాడు. కొత్తపల్లినుంచి జగ్గంపేట వెళ్లే రోడ్డులో ఆదర్శకళాశాల దాటిన తర్వాత మలుపులో మోటార్‌సైకిల్ అదుపుతప్పి ప్రమాదవశాత్తూ రోడ్డు డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో సతీష్ తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మరణించగా తోటి స్నేహితుడు స్వల్పగాయాలయ్యాయి. సతీష్ మృతిపట్ల స్థానికులు, బంధువులు విలపించారు. గోకవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొండ దిగుతారు!



కూనవరంలో కొండలపై కొండరెడ్ల ఇళ్లు

- కూనవరంలో కొండరెడ్లకు పీఎం జన్‌మాన్ కింద ఇళ్లస్థలాల మంజూరు
- కొండలపై నుంచి కిందకు దిగనున్న 9 గ్రామాల్లోని 136 కుటుంబాలు
- స్థలం కోసం అటవీశాఖకు ప్రతిపాదనలు పంపిన గృహనిర్మాణశాఖ

కూనవరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి ఆమడ దూరంలో నివసిస్తున్న కొండరెడ్లు ఇక బాహ్య ప్రపంచంలోకి అడుగుపెట్టనున్నారు. విద్య, వైద్యం ఇప్పటికీ వారికి అందని ద్రాక్షే. ఒకవైపు టెక్నాలజీ శరవేగంగా అభివృద్ధి జరుగుతున్నా, మరో వైపు కొండరెడ్ల జీవన వ్యవస్థ మాత్రం ఎక్కడ వేసిన గొంగలి అక్కడి లాగే ఉంది.

అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలంలోని కూటూరు గుట్టపై 9కొండరెడ్ల గ్రామాల్లో ప్రజలు నివాసముంటున్నారు. వీరిని కొండలపైనుంచి కిందకి దింపాలని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ కంకణం కట్టారు. ఇప్పటికే ఆయన ఢిల్లీలోని సంబంధిత శాఖాధికారులతో మాట్లాడి పీఎం జన్‌మాన్ పథకం కింద ఇళ్లు సైతం మంజూరు చేశారు. దీంతో కొండరెడ్లు గ్రామాలైన కలింగమెద్దికి చెందిన పది కుటుంబాలకు కోపిరిమెట్టలో 19 కుటుంబాలకు, ఎలుగులగొందిలో 7 కుటుంబాలకు, తోటమామిడిగొందిలో 15 కుటుంబాలకు, పుసులుమామిడిగొందిలో 6 కుటుంబాలకు, చింతగండిలో 15 కుటుంబాలకు, కొత్తకారుమానుకోట 23 కుటుంబాలకు, గబ్బిలాలగొంది 21 కుటుంబాలకు, పాతకారుమానుకోట 20 కుటుంబాలకు మొత్తం 136 కుటుంబాలకు ఇళ్లు మంజూరయ్యాయి. ఇళ్ల కోసం నిర్మాణం కోసం రెండెకరాల భూమి కేటాయించాలని హౌసింగ్‌శాఖ, అటవీశాఖ అనుమతికోసం ప్రతిపాదనలు పంపింది. దీంతో కూనవరం-చింతూరు ప్రధాన రోడ్డు మార్గంలోని కూటూరు బస్టాండ్ దగ్గర స్థలం పరిశీలించారు. వచ్చేఏడాది 2026 నాటికి ఈ ఇళ్లు పూర్తి చేయనున్నారు. కొండరెడ్లకు అన్ని వసతులు కల్పించి వారిని మైదాన ప్రాంతంలోని జనజీవనంలో జీవించేలా బాహ్య ప్రపంచానికి పరిచయం చేయనున్నారు.

ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు

కూటూరు గుట్టపై ఉంటున్న కొండరెడ్ల కోసం ఇళ్లు నిర్మించేందుకు భూమి కేటాయించాలని హౌసింగ్‌శాఖనుంచి అనుమతికోసం ప్రతిపాదనలు వచ్చినట్లు కూనవరం అటవీశాఖాధికారి కరుణాకరన్ ఆంధ్రజ్యోతికి తెలిపారు. దీనికి నివేదిక తయారుచేసి అటవీశాఖ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతానని తెలిపారు. ప్రతిపాదనలు మంజూరుకాగానే స్థలం కేటాయిస్తామన్నారు.

కోళ్ల ఫారాల్లో..

వైరస్ భయం



గండేపల్లి మండలం కె.గోపాలపురంలో ఫారంలో ఉన్న బ్రాయిలర్ కోళ్లు

- ఉమ్మడి జిల్లాల్లో కొత్త వైరస్ ఆందోళన
- పక్క జిల్లాలో కోళ్లు చనిపోవడంతో వణుకు
- బెంబేలెత్తిపోతున్న కోళ్లఫారాల నిర్వాహకులు

గండేపల్లి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఎండాకాలం వస్తోందంటేనే బ్రాయిలర్ ఫారాల నిర్వాహకుల గుండెల్లో దడపుడుతోంది. కంటికి రెప్పలా కాపాడుకునే కోళ్లు ఎండల తీవ్రత, వడగాల్పులకు పిట్టల్లా రాలిపోతుంటాయి. రెండేళ్లుగా ఎండాకాలంలో ఫారం నిర్వాహకులు నష్టాలు ఎదుర్కొంటున్నారు. ఈ సంవత్సరం వేసవి భయంతోపాటు వైరస్ భయం కూడా ఫారం నిర్వాహకులను బెంబేలెత్తిస్తోంది. పక్క జిల్లాల్లో వైరస్ తెగులుతో బ్రాయిలర్ కోళ్లు పిట్టల్లా రాలిపోతుండగా మన ఉమ్మడి జిల్లాలో కూడా పలుచోట్ల కోళ్లు చనిపోతున్నాయి. వైరస్ విజృంభిస్తే పరిస్థితి ఏంటని రైతుల్లో ఆందోళన నెలకొంది.

ఉమ్మడి జిల్లాలో కోళ్లఫారాలు

ఫారాల్లో బ్రాయిలర్ కోళ్లను పిల్ల దగ్గర నుంచి 45 - 55రోజుల వరకు కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తుంటారు. ఎటువంటి తెగులు వ్యాపించకుండా ఎప్పటికప్పుడు వాటికి కావాల్సిన సౌకర్యాలు అందిస్తుంటారు. ఎండాకాలంలో మజ్జిగ, బీట్‌రూట్ జ్యూస్ సైతం కోళ్లకు పెడుతుంటారు. షెడ్లపై చల్లదనానికి ఆకులు వేసి నీటితో తడుపుతూ జాగ్రత్తలు తీసుకుంటారు. కానీ, ఇప్పుడు వ్యాపిస్తున్న వైరస్ మహమ్మారి సోకకుండా పరిరక్షించేందుకు పలు కంపెనీలు ముందుగానే చర్యలు తీసుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని అనపర్తి, రంగంపేట, సామర్లకోట, జగ్గంపేట, రాజానగరం, మండపేట, రాయవరం తదితర ప్రాంతాల్లో కోళ్ల ఫారల్లో లక్షల సంఖ్యలో కోళ్ల పెంపకం జరుగుతోంది. గండేపల్లి మండలంలో కె.గోపాలపురం, ఎన్టీరాజాపురం, తాళ్లూరు, గోపాలపురం, సుబ్బయ్యమ్మపేట పలు ప్రాంతాల్లో 2లక్షలకు పైగా కోళ్ల పెంపకం జరుగుతోంది. ప్రస్తుతం వైరస్ భయంతో ఫారాల నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు.

వైరస్ సోకకుండా చర్యలు తీసుకోవాలి
-యరమల్ల విష్ణు, ఫారం నిర్వాహకుడు

కోళ్లకు వైరస్ సోకకుండానే కంపెనీలు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే కోళ్ల ఫారాల్లో లాభాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. వేసవి భయంతోపాటు వైరస్ భయం కూడా భయపెడుతోంది. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

హేచరీలో కేసినో తరహాలో పేకాట







అల్లవరం మండలం కొమరగిరిపట్నంలో ఇటీవల ఓ వైసీపీ నేత హేచరీ వద్ద కేసినో తరహాలో కోడిపందేలు, పేకాటలు

- కోనసీమ జిల్లా అల్లవరం మండలం కొమరగిరిపట్నంలో విందు, వినోదంతో చిందులు
- వైరల్ అయిన వీడియోలు.. స్పందించిన పోలీసులు
- కేసు నమోదు చేశామని అల్లవరం ఎస్‌ఐ ప్రకటన

అమలాపురం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పోలీసు యంత్రాంగం ఉదాసీనంగా ఉండడంతో అసాంఘిక శక్తులు పేట్రేగిపోతున్నాయి. కోనసీమ జిల్లా అల్లవరం మండలం కొమరగిరిపట్నంలో వైసీపీ నేతకు చెందిన ఓ హేచరీలో ఇటీవల ఓ పార్టీ జరిగింది. విందు, వినోదాలతోపాటు కేసినో తరహాలో భారీ జూద క్రీడ నిర్వహించారు. కాయిన్లతో ఈ ఆటను నిర్వహించడం దానికి కోనసీమలోని కీలక నాయకులు హాజరైనప్పటికీ పోలీసులు ఆ వ్యవహారాన్ని చూసీచూడనట్టు వదిలేయడం గమనార్హం. అక్కడ జరిగిన విందుతోపాటు కేసినో తరహా జూద క్రీడకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో గురువారం వైరల్ అయ్యాయి. దీంతో పోలీసు అధికారులు స్పందించారు. అందుకు బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేస్తున్నట్టు అల్లవరం ఎస్‌ఐ హరీష్ ఒక ప్రకటన చేశారు. పక్కా వ్యూహంతో ఆ హేచరీ వద్ద తరచూ ఈ తరహాలో పేకాట, కోడిపందేలు కేసినో తరహా ఆటలు వంటివి జరుగుతున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల జరిగిన జూద క్రీడతోపాటు రాత్రివేళల్లో కోడిపందేలు కూడా నిర్వహించి భారీగా సొమ్ములు కాసినట్టు తెలిసింది. వీడియోలు వైరల్ అవ్వడంతో పోలీసులు విధిలేని పరిస్థితిలో వారిపై కేసులు పెడుతున్నామని వెల్లడించారు. ఈ జూద క్రీడలో పాల్గొనేందుకు కూటమికి చెందిన స్థానికేతర ఎమ్మెల్యే ఒకరు ముఖ్యఅతిథిగా హాజరై ఈ వినోదాలను తిలకించారని సమాచారం. అల్లవరం మండలం కొమరగిరిపట్నంలో హేచరీవద్ద ఘటనలో బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేసినట్టు అల్లవరం ఎస్‌ఐ హరీష్ తెలిపారు. వీటిని నిర్వహించడానికి కారకులైన హేచరీ యజమానిపైన కేసు నమోదు చేశామన్నారు. వీడియోల ఆధారంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిని గుర్తించి అరెస్టు చేస్తామని ఎస్‌ఐ తెలిపారు. అమలాపురం పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో బుధవారం రాత్రి పేకాట ఆడుతున్న ఓ స్థావరంపై పోలీసులు దాడిచేసి 9 మందిని అరెస్టుచేసి వారి నుంచి రూ.77వేల నగదును స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. అమలాపురంతో ఇతర ప్రాంతాల్లో కూడా అనధికారికంగా పేకాట క్లబ్‌లు రహస్య స్థావరాల్లో నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

బర్డ్‌ఫ్లూ పట్ల అప్రమత్తంగా ఉండాలి

కాకినాడ జిల్లా పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు

కలెక్టరేట్(కాకినాడ),ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూ వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలని కాకినాడ జిల్లా పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు సూచించారు. ఈ మేరకు ఒక ప్రకటన వెలువరించారు. ఇది ఎక్కువగా కోళ్లు, బాతులు, టర్కీలపై ప్రభావం చూపుతుందన్నారు. ఈ వ్యాధితో మృతి చెందిన కోళ్లను ముట్టుకోవడం, ఆ మాంసం తినడం ద్వారా మానవులకు సోకే అవకాశం ఉందన్నారు. అధిక ఉష్ణోగ్రతలో ఉడికించిన మాంసాన్ని మాత్రమే తినాలన్నారు. పెద్ద మొత్తంలో కోళ్లు మృతిచెందితే తమకుఫిర్యాదు చేయాలన్నారు.

లక్ష్యాన్ని అధిగమించే దిశగా పొల్లూరు జలవిద్యుత్ కేంద్రం



పొల్లూరు జల విద్యుత్ కేంద్రం

మోతుగూడెం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): సీలేరు కాంప్లెక్స్‌లోని పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో లక్ష్యాన్ని అధిగమించేదిశగా విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందని ప్రాజెక్టు డీఈ భీమవరపు బాలకృష్ణ తెలిపారు. సీలేరు నది పరివాహక ప్రాంతంలో ఈఏడాది అత్యధికంగా వర్షాలు కురవడం కలిసి వచ్చిందన్నారు. 2024-25 మార్చికి పొల్లూరు ఉత్పత్తి లక్ష్యం 1084మిలియన్ యూనిట్లు కాగా, ఫిబ్రవరి నాలుగు నాటికి 1020.4మిలియన్ యూనిట్ల ఉత్పాదన జరిగిందని తెలిపారు. ఈ కేంద్రంలో నిత్యం 3.7మిలియన్ యూనిట్లనుంచి 4మిలియన్ యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పతి జరుగుతోందని, దీని ప్రకారం ఫిబ్రవరి 25వతేదీ నాటికి లక్ష్యాన్ని అధిగమించి రికార్డు నెలకొల్పే అవకాశాలున్నాయన్నారు. మార్చి నెలాఖరుకు ఈ కేంద్రం నుంచి 100 మిలియన్ యూనిట్లు అదనపు విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందని అంచనా వేస్తున్నామన్నారు. సీలేరు కాంప్లెక్స్‌లోని జలాశయాల్లో 50టీఎంసీల వరకు నీటి నిల్వలు ఉన్నాయి. దీంతో రానున్న వేసవిలో సైతం విద్యుత్ ఉత్పత్తికి ఢోకా ఉండబోదని భావిస్తున్నామని తెలిపారు.

రుణాలు తీరకుండానే డ్వాక్రా గ్రూపు ఖాతాల్లో నగదు జమ



రాజవొమ్మంగి మండలం దూసరపాములో విచారణ చేపడుతున్న వెలుగు సీసీలు

- ఆశ్చర్యానికి గురైన డ్వాక్రా సంఘాల సభ్యులు
- విచారణ చేసిన వెలుగు సీసీలు

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): బ్యాంకు నుంచి తీసుకున్న డ్వాక్రా రుణాలు ఇంకా తీరకుండా బ్యాంకు అధికారులు రెండు డ్వాక్రా గ్రూపుల్లోకి నగదు జమ చేశారు. అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలం దూసరపాము పంచాయతీలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అరుణ, స్రవంతి గ్రూపులకు రుణం తీరకుండా మళ్లీ వారి గ్రూపు ఖాతాల్లో నగదు జమకావడంపై గ్రూపు సభ్యులు ఒకింత ఆశ్చర్యం, ఆందోళన వ్యక్తం చేశారు. తాము అడగకుండానే నిధులు ఖాతాలో జమ కావడంపై పలు అనుమానాలతో ఏపీఎంకు ఫిర్యాదు చేశారు. దీనిపై గురువారం ఐదుగురు వెలుగు సీసీలు గ్రామానికి విచ్చేసి డ్వాక్రా సంఘాల సభ్యులతో సమావేశమై పరిస్థితి అడిగి తెలుసుకుని విచారణ చేపట్టారు. తమ తీర్మానం లేకుండా తమ గ్రూపు ఖాతాల్లోకి నగదు ఎలా జమైందని అధికారులను ప్రశ్నించారు. రెండు గ్రూపులకు సంబంధించి రూ.40లక్షలు ఖాతాల్లో జమయ్యాయని, దీనికి సంబంధించి వివరాలు వెలుగు అధికారులకు ఇవ్వకుండా నేరుగా బ్యాంకు అధికారుల నేతృత్వంలో జమ చేసినట్లు ఆరోపణలు చేస్తున్నారు. సీసీ మీడియాతో మాట్లాడుతూ సాధారణంగా సంఘ సభ్యుల తీర్మానంతోనే డ్వాక్రా రుణాలు విడుదల చేస్తారని, ప్రస్తుతం ఈ ఘటనలో సంఘ సభ్యులు తెలిపిన ప్రకారం నివేదిక ఏపీఎంకు అందజేస్తామని అన్నారు. ఎక్కడ తప్పిదం జరిగిందో ఉన్నతాధికారుల విచారణలో తేలుతుందన్నారు. దీనిపై పూర్తి వివరణ బ్యాంకు మేనేజర్ దగ్గర తీసుకోవాలన్నారు.

ఆటో బోల్తాపడి మహిళకు గాయాలు

జీజీహెచ్ (కాకినాడ), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తాపడి ఓ మహిళ చెవితెగిపడి తీవ్రంగా గాయపడిన ఘటన గురువారం రాత్రి కాకినాడలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ మెయిన్‌రోడ్డు నుంచి ఓ ఆటో ముగ్గురు ప్యాసింజర్లతో జగన్నాథపురంలోని జె.రామారావుపేటకు బయలుదేరింది. ఆటో బ్లూకాన్వెంట్ వద్దకు వెళ్లేసరికి ఆ మలుపులో ప్రమాదవశాత్తూ బోల్తాపడింది. ఈ నేపథ్యంలో జగన్నాథపురానికి చెందిన 50ఏళ్ల చింతా పార్వతి కుడి చెవి తెగివేరు పడి తీవ్రంగా గాయాపడింది. ఆమెతోపాటు స్వల్ప గాయాలపాలైన మరో ఇద్దరు ప్యాసింజర్లను కూడా స్థానికులు గమనించి జీజీహెచ్‌కు తరలించారు. కాకినాడ వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సామర్లకోట ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సెల్ చోరీ

- వెంటనే నిందితుడిని పట్టుకున్న ట్రాఫిక్ ఎస్‌ఐ

సామర్లకోట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా సామర్లకోట ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ప్రయాణికుల నుంచి సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్న ఒక వ్యక్తిని సామర్లకోట ట్రాఫిక్ ఎస్‌ఐ అడపా గరగారావు తన సిబ్బందితో కలిసి గురువారం మధ్యాహ్నం పట్టుకున్నారు. బస్సు ఎక్కేందుకు కాంప్లెక్స్‌కు చేరుకున్న ఒక మహిళ సెల్‌ఫోన్‌ను చోరీ చేసినట్లు ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ట్రాఫిక్ ఎస్‌ఐ సత్వరం స్పందించి సీసీ పుటేజీలను పరిశీలించారు. సెల్‌ఫోన్ చోరీ చేసిన వ్యక్తిని గుర్తించి ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలోనే అతని కదలికలపై నిఘా ఉంచి అదుపులోకి తీసుకున్నారు. చోరీకి పాల్పడిన వ్యక్తి పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడుకు చెందిన ప్రేమ్‌కుమార్‌గా పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. అతడిని సామర్లకోట పోలీస్‌స్టేషన్‌కు తదుపరి దర్యాప్తు నిమిత్తం తరలించారు.

14మంది కేజీబీవీ విద్యార్థినులకు అస్వస్థత



కేజీబీవీ పాఠశాలలో విచారణ చేస్తున్న ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు

వై.రామవరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా వై.రామవరం మండలం తోటకూరపాలెం కస్తూర్బా విద్యాలయంలోని 14మంది విద్యార్థినులు గురువారం అస్వస్థతకు గురయ్యారు. వారిని చవిటిదిబ్బలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అంబులెన్సులో తరలించారు. జీర్ణావస్థ ప్రక్రియకు గురికావడంతో వారిలో 8మందికి వాంతులు, ఐదుగురికి లూజ్‌మోషన్లు, గొంతునొప్పి, ఒకరికి కడుపునొప్పి ఉన్నాయని వారికి చికిత్స అందించి స్కూల్‌కు పంపించామని వైద్యాధికారులు డాక్టర్ నరేంద్ర, డాక్టర్ దినేష్ తెలిపారు. దీనిపై పాఠశాల స్పెషల్ ఆఫీసర్ లక్ష్మీని వివరణ కోరగా పాఠశాలలో ఉదయం ఒక విద్యార్థినికి గ్రీన్ కలర్‌లో వాంతు కావడంతో ఆస్పత్రికి పంపించామన్నారు. మిగిలిన విద్యార్థినులను కూడా ఆసుపత్రికి పంపించి పరీక్షలు జరిపించామన్నారు. పాఠశాలలో ఫుడ్ పాయిజన్ జరిగినట్లు విస్తృత ప్రచారం జరగడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏజెన్సీ డీఈఓ మల్లేశ్వరరావు వెంటనే పాఠశాలకు వచ్చి విచారణ జరిపారు. ఆయన వెంట ఎంఈవో 2 వెంకటరమణ, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ లక్ష్మి ఉన్నారు.

చింతూరులో గుండెనొప్పి బాధితుడికి చికిత్స

ప్రభుత్వాస్పత్రిలో ఖరీదైన ఇంజక్షన్

చింతూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): చింతూరు ఏరియా ఆస్పత్రిలో గుండెనొప్పి బాధితుడికి ప్రాథమిక చికిత్స అందించి ప్రాణాలు నిలబెట్టారు. అల్లూరి జిల్లా చింతూరు మండలం కొత్తపల్లికి చెందిన ఎస్కే. చంటికి గురువారం గుండెనొప్పి వచ్చింది. దీంతో సమీపంలో తులసిపాకల ప్రాథమిక వైద్యశాలకు వెళ్లి పరీక్షలు చేయించుకున్నాడు. అక్కడి వైద్యులు పరిస్థితిని అంచనా వేసి చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇక్కడ వివిధ పరీక్షలు నిర్వహించిన వైద్యులు చంటికి గుండెపోటుగా నిర్ధారించారు. వెంటనే బాధితుడికి రూ.40వేల విలువైన టెనెక్టిప్లెస్ ఇంజక్షన్ ఇచ్చి ప్రాణాలు నిలబెట్టారు. మెరుగైన చికిత్సకోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. వైద్య సేవలు అందించిన వారిలో ఏరియా ఆస్పత్రి పర్యవేక్షణాధికారి డాక్టర్ కోటిరెడ్డి, డాక్టర్ సాయికిషోర్ పాల్గొన్నారు.

సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



అన్నవరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యన్నదాన పథకానికి గురువారం హైదరాబాద్‌కు చెందిన పుణ్యమంతుల సత్యనారాయణ దంపతులు రూ.1,11,600 విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని దాత ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేయగా దాతను ఆయన అభినందించి వారికి స్వామి వారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు.

అనుమతులు లేకుండా ఆలయ నిర్మాణం



అనపర్తి శివారు కొత్తూరు కాలనీలో నిర్మాణంవద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

- నిర్వాహకులకు నోటీసులు జారీ చేసి విగ్రహ ప్రతిష్ఠను అడ్డుకున్న అధికారులు
- అనపర్తి మండలం కొత్తూరులో 144 సెక్షన్, భారీ పోలీసు బందోబస్తు

అనపర్తి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): అనపర్తి శివారు కొత్తూరుకాలనీలో అనుమతులు లేకుండా వైసీపీనాయకులు నిర్మాణంచేసిన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ వివాదాస్పదంగా మారింది. కొత్తూరుకు చెందిన వైసీపీ నాయకులు ఆలయాన్ని నిర్మించి 7న విగ్రహ ప్రతిష్టా కార్యక్రమమని కరపత్రాలు పంపిణీ చేశారు. దీంతో పంచాయతీ అధికారులు ఆలయ నిర్మాణం చేపట్టిన స్థలంపై ఆరా తీశారు. ఆ స్థలం కాలనీకి చెందిన ప్రభుత్వ భూమిఅని గుర్తించి ఆలయ నిర్మాణానికి అనుమతులు చూపాలని ఆలయ కమిటీని కోరారు. దీంతో వారు అనుమతులు లేవని చెప్పడంతో నిర్వాహకులకు నోటీసులు జారీచేశారు. అనుమతులు పొందిన తర్వాత మాత్రమే మిగిలిన కార్యక్రమాలు నిర్వహించుకోవాలని సూచించారు.ఈ వివాదంపై సోషల్ మీడియాలో అనేక కథనాలు రావడం ప్రజలను రెచ్చగొట్టేలా పోస్టులు రావడంతో అధికారులు స్పందించి ముందస్తు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా ఆలయం వద్ద ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించరాదని బ్యానర్లు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ అనిల్ కుమార్, ఎంపీడీవో రామకృష్ణారెడ్డి, అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు, ఎస్‌ఐ శ్రీనునాయక్ ఆధ్వర్యంలో నిర్వాహకులతో సమావేశం నిర్వహించి ఏ కార్యక్రమాలు చేపట్టరాదని తెలిపారు. ఏఎస్పీ సుబ్బారావు మీడియాతో మాట్లాడారు. నిర్వాహకులతో సమావేశం నిర్వహించి అనుమతులు లేకుండా కార్యక్రమాలు చేపట్టవద్దని ఆదేశాలు జారీ చేశామన్నారు. కొత్తూరు కాలనీల్లో 144సెక్షన్ విధించి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు.

చెత్త ఆటో ఢీకొనడంతో వాహనకారులకు గాయాలు

అంతర్వేది, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మూడో రోజు రాత్రి శేషవాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తుండగా రెవెన్యూ గెస్ట్ హౌస్ పరిధిలో అటుగా చెత్త తరలిస్తున్న ఆటో వెనుక నుంచి ఢీకొనడంతో నలుగురు వాహనకారులకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సాయంతో క్షతగాత్రులను మలికిపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. దేవస్థానానికి సంబంధించిన చెత్తను తరలిస్తుండగా రాత్రి సమయంలో ఈ సంఘటన చోటుచేసుకోవడం దురదృష్టకరమని, మిగిలిన వాహనకారులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామోత్సవం సందర్భంగా ఈ ఘటన జరిగినప్పటికీ మిగిలిన వాహనకారులు శేషవాహనాన్ని గమ్యానికి చేర్చారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

పొన్నాడలో నేటి నుంచి బంగారు పాప ఉరుస్ ఉత్సవాలు

కొత్తపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొన్నాలో వేంచేసియున్న బషీర్‌బీబీ ఔలియా (బంగారు పాప) ఉరుస్ ఉత్స వాలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. ఆదివారం వరకు మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో పాల్గొనేందుకు దేశం నలుమూలల నుంచి హిందూ, ముస్లిం భక్తులు రానున్నారు. ఈ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, కొత్తపల్లి ఎస్‌ఐ జి.వెంకటేష్ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం జరిగే గంధో త్సవానికి వచ్చే భక్తుల తాకిడికి అనుగుణంగా పోలీసులు చర్యలు చేపట్టారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఈవో జగన్మోహన శ్రీనివాస్. చిత్రంలో ఆర్డీవో మల్లిబాబు

భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు

మహాశివరాత్రి ఏర్పాట్లపై పాదగయలో సమీక్షా సమావేశం

పిఠాపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పాదగయకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని కాకినాడ ఆర్డీవో మల్లిబాబు ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పట్టణంలోని పాదగయ క్షేత్రంలో జరిగే మహా శివరాత్రి, రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి కల్యాణోత్సవాల ఏర్పాట్లపై గురువారం సాయంత్రం ఆర్డీవో అన్ని శాఖల అధికారులతో సమీక్షించారు. లక్షల సంఖ్యలో వచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లు పటిష్టంగా ఏర్పాటు చేయాలని, ఆలయం లోపల, బయట అన్ని ప్రాంతాల్లో ప్రత్యేక లైటింగ్ ఏర్పాట్లు ఉండాలని కోరారు. క్యూలైన్లలో భక్తులకు తాగునీరు, మజ్జిగ, పిల్లలుకు పాలు అందుబాటులో ఉంచాలన్నారు. ఆలయం లోపలికి వచ్చే, బయటకు వెళ్లే మార్గాలు ప్రత్యేకంగా ఉండాలన్నారు. వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేయాలని, సామాన్య భక్తులు సులభంగా దర్శనం చేసుకునేందుకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. పాదగయ పుష్కరిణిలో ఏలేరు జలాలు నింపాలన్నారు. సమావేశంలో పాదగయ కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్, పిఠాపురం మునిసిపల్ కమిషనరు నామా కనకారావు, సీఐ జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ భావన

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

సామర్లకోట భీమేశ్వరాలయంలో మహాశివరాత్రి ఏర్పాట్లపై సమీక్షలో ట్రైనీ కలెక్టర్ భావన

సామర్లకోట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో ఈ నెల 26 నుంచి జరిగే మహా శివరాత్రి ఉత్సవాలకు భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తామని ట్రైనీ కలెక్టర్ భావన వెల్లడించారు. సామర్లకోట భీమేశ్వరాలయంలో ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో గురువారం ఆమె మహా శివరాత్రి ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. భక్తులు గోదావరి పుష్కరిణి, కోనేరుల్లో పవిత్ర స్నానాలాచరిస్తారని, గోదావరి కాలువలో ఎగువ ప్రాంతాల్లో జలాలు కాలుష్యం కాకుండా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, కాలుష్య నియంత్రణ మండలి, మున్సిపల్ అధికారులకు సూచించారు. కాగా విశేష పూజల్లో భాగంగా అధికారుల అనుమతితో శివలింగాన్ని పాలతో అభిషేకిస్తామని ఈవో నీలకంఠం తెలిపారు. ఆలయ ఆవరణలో మందులు సరఫరా చేసేందుకు ప్రత్యేక శిబిరం నిర్వహణకు సహకరించాలని డాక్టర్ కె.ప్రభ, డాక్టర్ రమ్యశ్రీదుర్గ ఆలయ అధికారులను కోరగా ఈవో అంగీకరించారు. రాష్ట్రం నలుమూలల నుంచీ అధిక సంఖ్యలో విచ్చేసే భక్తులకు సదుపాయాలు అందించేందుకు అధికారులు సమన్వయంతో పని చేస్తామని తహసీల్దారు కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో కాలుష్య నియంత్రణ మండలి ఏఈ ప్రణీత, మున్సిపల్ కమిషనరు శ్రీవిద్య, డీఈ శశిధర్, ధర్మకర్తల మండలి మాజీ ఛైర్మన్ కంటే జగదీష్ మోహన్ (బాబు), సీఐ కృష్ణభగవాన్, డిప్యూటీ తహసీల్దారు వై.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫోరెన్సిక్ విభాగాధిపతికి లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు

జీజీహెచ్ (కాకినాడ), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయవైద్య కళాశాల ఫోరెన్సిక్ విభాగాధిపతి డాక్టర్ పి.ఉమామహేశ్వరరావుకు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు లభించింది. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు ఫోరెన్సిక్ మెడికోన్-25 పేరుతో చెన్నైలో జరిగిన 46వ వార్షిక జాతీయ సదస్సులో తెలంగాణ పూర్వ గవర్నర్ తమిళిసై నుంచి ఉమామహేశ్వరరావు అవార్డు అందుకున్నారు. ఆయనకు ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్, ఫోరెన్సిక్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.ఫణికిరణ్ అభినందనలు తెలిపారు.



తమిళిసై నుంచి అవార్డు అందుకుంటున్న డాక్టర్ ఉమామహేశ్వరరావు

వైడీఆర్‌కు మంత్రి సత్యకుమార్ అభినందన

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ నూతన ఛైర్మన్‌గా ఎన్నికైన రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ వైడీ రామారావు అమరావతిలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. రెడ్‌క్రాస్ సంస్థకు రెండున్నర దశాబ్దాలుగా సేవలందిస్తూ ఇప్పుడు రాష్ట్ర శాఖ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన వైడీఆర్‌ను మంత్రి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. రెడ్‌క్రాస్ సహకారంతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో సైతం రక్త నిల్వలను అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపడతామన్నారు. రెడ్‌క్రాస్ ద్వారా తలసేమియా వ్యాధిగ్రస్తులకు అందజేస్తున్న సేవలను మంత్రి ప్రశంసించారు.



మంత్రి సత్యకుమార్‌ను సత్కరిస్తున్న రామారావు

బాల్య వివాహాలతో అన్నీ అనర్థాలే

ఐసీడీఎస్ పీడీ విజయకుమారి

పిఠాపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలతో అన్నీ అనర్థాలేనని, భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కొంటారని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ విజయకుమారి పేర్కొన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పిఠాపురంలో గురువారం కిశోరి వికాసం మునిసిపల్ స్థాయి శిక్షకులకు శిక్షణనిచ్చారు. బాలికల్లో చిన్ననాటి నుంచే ఆత్మస్థైర్యం పెంపొందించాలని సూచించారు. బాల్య వివాహాల నిరోధక కమిటీల పని తీరును వివరించారు. మున్సిపల్ కమిషనరు నామా కనకారావు, జిల్లాల బాలల రక్షణ అధికారి వెంకట్, చైల్డ్‌లైన్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత, ఎంఎల్‌ఎస్‌సీ గుదిమెళ్ల శ్రీభాస్కరాచార్యులు, సీడీపీవో దుర్గాదేవి, ఎంఈవో శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.



ఉప్పాడ-1 వీఆర్వో రాంబాబు మృతి

కొత్తపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉప్పాడ-1 వీఆర్వో పోసపల్లి రాంబాబు (48) గురువారం ఉదయం మృతి చెందారు. ఇటీవల ఆయనకు కిడ్నీ సంబంధిత వ్యాధి రావడంతో ఆపరేషన్ చేసి తొలగించారని సహచర ఉద్యోగులు తెలిపారు. అప్పటి నుంచీ ఇంటి వద్దే ఉండి చికిత్స పొందుతున్న రాంబాబు గురువారం మృతి చెందారన్నారు. వీఆర్వో రాంబాబు మృతికి కొత్తపల్లి తహసీల్దారు జి.చిన్నారావు, వీఆర్వోల సంక్షేమ సంఘం మండల ప్రతినిధులు రాంబాబు మృతదేహాన్ని సందర్శించి కుటుంబీకులకు సానుభూతి తెలిపారు.



పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి 'పేరాబత్తుల'కు మద్దతుగా ప్రచారం

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి రాజశేఖర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కూటమి నాయకులు కోరారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆధ్వర్యంలో గురువారం టీడీపీ జిల్లా కార్యాలయంలో కూటమి నాయకులు సమావేశమయ్యారు. సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ తోట సుధీర్, బీజేపీ నాయకుడు గట్టి సత్యనారాయణ, కాకినాడ సిటీ ఎన్నికల పరిశీలకుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్ హాజరయ్యారు. టీడీపీ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ వొమ్మి బాలాజీ, టీడీపీ నాయకులు బచ్చు శేఖర్, ఎంఏ తాజుద్దీన్, గదుల సాయిబాబు, పలివెల రవి, బీజేపీ నాయకులు చెక్క రమేష్, గొల్లపల్లి శివ, గాలిదేవర శేఖర్, డి.వీరేంద్ర, జి.భాగ్యలక్ష్మి, జనసేన నాయకులు అడబాల సత్యనారాయణ, డి.సత్యప్రసాద్, నీలపల్లి కామరాజు, పాలిక శివ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతుగా పిఠాపురం పట్టణంలోని ప్రైవేటు విద్యా సంస్థల్లో అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే, ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవిందసత్యనారాయణ, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ప్రచారం నిర్వహించారు. టీడీపీ నాయకులు వాసిరెడ్డి ఏసుదాసు, కొండేపూడి ప్రకాష్, పిల్లి చిన్నా, కోళ్ల బంగారుబాబు తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం (సామర్లకోట): పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ గెలుపునకు సహకరించాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కోరారు. గురువారం ఆయన పెద్దాపురం మహారాణి కళాశాల ఆవరణలో ఎన్నికల పరిశీలకుడు వెంకటరమణ చౌదరితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబురాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కాకినాడ రూరల్ (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు ఓటు వేసి గెలిపించాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను కోరారు. గురువారం ఆయన కాకినాడ రూరల్ ఎన్నికల పరిశీలకుడు సుధాకర్, శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ కుడిపూడి సత్తిబాబు, టీపీడీ కో-ఆర్డినేటర్ కటకంశెట్టి బాబీ, నురుకుర్తి వెంకటేశ్వరరావులతో కలిసి తూరంగి, పగడాలపేట, బొడ్డుచెరువు ప్రాంతాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి నాయకులు శిరంగు శ్రీనివాసరావు, మాసుమేను గంగయ్య, సీతయ్యదొర, వినాయక్, నాగమణి పాల్గొన్నారు.

కరప (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ గెలుపునకు అందరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్తిబాబు సూచించారు. కరపలోని టీడీపీ కార్యాలయంలో గురువారం వారు పార్టీ నాయకులు, బూత్, క్లస్టర్ ఇన్‌చార్జిలతో సమావేశమయ్యారు. అనంతరం కరప, నడకుదురు, గురజనాపల్లి, యండమూరు, పాతర్లగడ్డ గ్రామాల్లో కరపత్రాలను పంచుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ నాయకులు చీపురుపల్లి జయేంద్రబాబు, కాకర్ల బుజ్జిబాబుచౌదరి, గరగ ఫకీర్రావు, యాసలపు విష్ణు, పలివెల జానకిరామయ్య, గొర్రెల వెంకటరమణ, మద్దూరి స్వామి, నక్కా వీరబాబు, పేపకాయల సత్తిబాబు, నూకల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



కాకినాడలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఐక్యత చాటుతున్న కూటమి నాయకులు



కాకినాడ రూరల్ తూరంగిలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే నానాజీ



పెద్దాపురం మహారాణి కళాశాలలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప



గ్రాడ్యుయేషన్ డే

పిఠాపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భాష్యం స్కూలులో చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. యూకేజీ విద్యార్థులకు పట్టాలు అందజేశారు. భాష్యం విద్యా సంస్థల జెడ్‌సీవో బి.సునీత, ప్రిన్సిపాల్ పోలుపర్తి వేణు, లిటిల్‌చాంప్స్ హెచ్‌ఎం అరుణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బూత్ కమిటీల ఏర్పాటుకు సన్నాహాలు

పెద్దాపురం (సామర్లకోట), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పెద్దాపురం పట్టణ శాఖ అధ్యక్షుడు బొలిశెట్టి రామ్‌కుమార్ అధ్యక్షతన గురువారం నియోజకవర్గ స్థాయి కమిటీల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు మాట్లాడుతూ నాలుగు మండలాలు, పట్టణ కమిటీలకు అధ్యక్షులను, 100 శాతం బూత్ కమిటీలను ఎన్నుకోవాల్సి ఉందన్నారు. ఎస్సీ ఎస్టీలకు ప్రాధాన్యమిస్తామని, ఈ నెల 14 లోగా కమిటీలను పూర్తి చేసేందుకు సహకరించాలని కోరారు. సమావేశంలో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తుమ్మల పద్మజ, బీజేపీ నాయకులు డాక్టర్ గోరకపూడి చిన్నయ్యదొర, దుర్గా మోహనరావు, శ్యామ్, గంగరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన విశ్వేశ్వరావును జనసేన జిల్లా అధ్యక్షుడు, కౌడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబురాజు మర్యాదపూర్వకంగా కలుసుకుని సత్కరించారు.



బీజేపీ జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరావును సత్కరిస్తున్న టీడీపీ, జనసేన నాయకులు



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ అవినాష్

కరాటేలో కేకేఆర్ విద్యార్థులకు పతకాలు

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విశాఖపట్నంలో జిగిన 8వ ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్‌షిప్‌లో కాకినాడ జయేంద్రనగర్ కేకేఆర్ గౌతమ్ స్కూలు విద్యార్థులు వ్యక్తిగత, కుమితే విభాగాల్లో జ్యోతి అమృత, హేమశ్రీ, లక్షిత నందన, విహాన్ బంగారు, రజత పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం వారిని పాఠశాల ఆవరణలో ఘనంగా సత్కరించారు. జాతీయ స్థాయిలో రాణించేలా తర్ఫీదు ఇస్తున్న కోచ్ మనోహర్‌ని స్కూల్ డైరెక్టర్ కె.అవినాష్, ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు అభినందించారు.

నేటి నుంచి వేట్లపాలెం వెంకన్న కల్యాణోత్సవాలు

సామర్లకోట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేట్లపాలెంలో వేంకటేశ్వరస్వామి దివ్య కల్యాణోత్సవాలను శుక్రవారం నుంచి ఈ నెల 12వ తేదీ వరకు నిర్వహించ నున్నట్టు ఆలయ వ్యవస్థాపకుడు పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి పెద్ద శేష వాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. 8న గోపూజ, 108 మంది దంపతులతో లక్ష పుష్పార్చన నిర్వహిస్తామన్నారు. రాత్రి చిన శేష వాహన సేవ అనంతరం స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని పారిశ్రామికవేత్తలు మట్టే శ్రీనివాస్-విద్యుల్లత దంపతులు, నున్న రామకృష్ణ-వెంకటలక్ష్మి దంపతులచే వాడపల్లి గోపాలాచార్యులు జరిపిస్తారని చెప్పారు.

త్రీటౌన్ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ జి.బిందుమాధవ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను, స్టేషన్ పరిసరాలను, భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా మెలుగుతూ వారి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగు కేసులను వేగంగా దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. మహిళా సంబంధిత కేసుల్లో పోలీస్‌స్టేషన్‌కు వచ్చేవారికి మనోధైర్యం కల్పించాలన్నారు. సైబర్ నేరాలు, దొంగతనాలు, డ్రగ్స్ వినియోగం, మహిళల రక్షణపై ప్రజలకు, విద్యార్థులకు ఎప్పటికప్పుడు అవగాహనా సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు.

సోలార్ రూఫ్ టాప్ విద్యుత్‌తో బహుళ ప్రయోజనాలు

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సోలార్ రూఫ్‌టాప్ విద్యుత్‌తో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ఏపీఈపీడీసీఎల్ పెద్దాపురం ఈఈఈ ప్రభాకర్ తెలిపారు. మండలంలోని తాటిపర్తిలో పీఎం సూర్యఘర్ యోజన పథకంపై డీఈ నేతృత్వంలో అధికారులు, సిబ్బంది పది బృందాలుగా ఏర్పడి గురువారం అవగాహన కల్పించారు. ఏడీఈ శ్రీనివాసరావు, ఏఈఈలు రామచంద్రరావు, రమేష్, నాగేశ్వరరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కుంతీమాధవుని కల్యాణోత్సవాలు ప్రారంభం

పిఠాపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): దేశంలోని పంచమాధవ క్షేత్రాల్లో ఒకటిగా విరాజిల్లుతున్న పట్టణంలోని కుంతీమాధవస్వామి దేవస్థానంలో కల్యాణోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. వైఖానస ఆగమ ప్రకారం సప్తాహ్నిక దీక్షతో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలు తొలిరోజున స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకం నిర్వహించారు. సాయంత్రం విశ్వక్సేనుల గ్రామోత్సవం జరిగింది. అనంతరం ధ్వజారోహణం జరిపారు. ఈవో నున్న శ్రీరాములు, కుంతీమాధవ భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి వేణుగోపాలకృష్ణకు మద్దతు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీచేస్తున్న భారత రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టా వేణుగోపాలకృష్ణకు బీసీ సంఘాలు మద్దతు తెలిపాయి. రామారావుపేటలోని కమ్యూనిటీ హాల్లో గురువారం రాష్ట్ర శెట్టిబలిజ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చొల్లంగి వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన సమావేశం జరి గింది. అభ్యర్థి కట్టా వేణుగోపాలకృష్ణ, బీసీ సంఘాల నాయకులు పోలా ఈశ్వరప్రసాద్, ఆవుపాటి ఉమాశంకర్, పొన్నగంటి సత్యనారాయణ, పితాని నూకరాజు, చింతపల్లి చంద్రశేఖర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.



కలెక్టర్ షాన్ మోహన్‌తో రాజేష్ మిట్టల్ బృందం

కలెక్టర్‌ను కలిసిన 'ఇసుజు' ఎండీ

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఇసుజు మోటార్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ప్రెసిడెంట్, మేనేజింగ్ డైరెక్టర్ రాజేష్ మిట్టల్ తన బృందంతో గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షాన్ మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. వికాస పీడీ కె.లచ్చారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిఠాపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ పెద్దాపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏపీఎస్‌డీఎస్ ప్రభాకర్ తెలిపారు. పిఠాపురం విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి వచ్చే భీమనగర్ 11కేవీ ఫీడర్‌పై లైన్ల మరమ్మతులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కారణంగా చిట్టోడితోట, మంగాయమ్మరావుపేట, కరిచేపాకుపేట, సీతయ్యగారితోట, విద్యుత్‌నగర్, రాజుగారికోట, మునిసిపల్ కార్యాలయం, మార్కెట్, విరవాడ రోడ్డు, యానాదుల కాలనీ, పాదగయ, కత్తులగూడెం, కాకినాడ రోడ్డు, కొండప్ప వీధి, చిత్రాడ బ్రిడ్జి, పాలిటెక్నిక్ కళాశాల, జడ్జి క్వార్టర్స్, ప్రభుత్వాసుపత్రి, రూరల్ పోలీసుస్టేషన్, ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్, సామర్లకోట రోడ్డు, గురుకుల పాఠశాల, పక్షుల మర్రిచెట్టు సెంటర్, సకలయ్య చెరువు, గాంధీ బొమ్మ సెంటర్, నూకాలమ్మ గుడి వీధి పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పెద్దాపురం ఈఈ ప్రభాకర్, కొత్తపల్లి ఏఈఈ ముమ్మిడి శ్రీనివాసరావు తెలిపారు. కొత్తపల్లి, వాకతిప్ప, ఉప్పాడ, రవీంద్రపురం, మూలపేట, కొండెవరం, ఇసు కపల్లి, యండపల్లి, నాగులాపల్లి, రమణక్కపేట, పొన్నాడ, నాగులాపల్లి, యండపల్లి చెరువు గ్రామాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వారు చెప్పారు.

పాదగయ పుష్కరిణిలో నీరు తొలగింపు ప్రారంభం

పిఠాపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాదగయ పుష్కరిణిలో నీటి తొలగింపును గురువారం ప్రారంభించారు. ఈనెల 24 నుంచి 28 వరకు జరిగే రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు, మహాశివరాత్రి ఉత్సవాల సమయంలో పాదగయ పుష్కరిణిలో పుణ్య స్నానాలు ఆచరించేందుకు లక్షలాది మంది భక్తులు వస్తారు. ఈ నెల 17వ తేదీలోగా పాత నీరు తొలగించి కొత్త నీరు పెడతారు. అప్పటివరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్టు ఈవో జగన్మోహన శ్రీనివాస్ తెలిపారు.

రోడ్డు భద్రతపై డ్రైవర్లకు అవగాహన

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఆర్టీసీ కాకినాడ డిపోలో గురువారం డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. కాకినాడ జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి కాకినాడ ఆర్డీవో శివారెడ్డి, మెడికల్ ఆఫీసర్ పద్మావతి, ఏవీ హరినాథ్‌రెడ్డి, ఏఎంవీఐ సాయిబాబు, డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్, అసిస్టెంట్ ఇంజనీర్ కె.ప్రభాకరరావు, అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ హాజరయ్యారు. బస్సులు నడిపేట ప్పుడు డ్రైవర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రమాదాలకు గురైన డ్రైవర్ల కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. పీఆర్వో సీహెచ్ వెంకటరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసరావు

ఐటీఐ విద్యార్థులకు ఇంజన్ బహూకరణ

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ)లోని ట్రేడ్స్ విద్యార్థులకు ట్రైనింగ్‌కు ఉపయోగపడే కట్ సెక్షన్ ఇంజన్‌ను ఇసుజు మోటార్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ బహూకరించింది. గురువారం దానిని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రాజేష్ మిట్టల్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఐటీఐ ప్రిన్సిపాల్ ఎంవీజీ వర్మ మాట్లాడుతూ విద్యార్థులకు ఈ ఇంజన్ చక్కగా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో వికాస పీడీ కె.లక్ష్మణరావు, విద్యార్థులు పాల్గొన్నారు. ఐటీఐలోని ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్ ట్రేడ్‌లో కాకినాడ కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సీఎస్‌ఆర్ నిధులతో ఆధునికీకరించిన ల్యాబ్, అధునాతన పరికరాలను యూనిట్ హెడ్ సీహెచ్ శ్రీనివాసరావు ఆవిష్కరించారు. కోరమాండల్ లిమిటెడ్, ఐటీఐ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల సంరక్షణకు కిషోర్ వికాసం

తుని రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): బాలికల సంరక్షణకే కిషోర్ వికాసమని మహిళాశిశు సంక్షేమ డైరెక్టర్ విజయకుమారి స్పష్టం చేశారు. తుని ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో కిషోర్ వికాసంపై సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. లింగ వివక్ష, నైపుణ్యం అభివృద్ధి, ఆత్మరక్షణ, మానవ అక్రమరవాణా, లైంగిక వేధింపులు వంటి అంశాలపై శిక్షణ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు, మెడికల్ ఆఫీసర్ శృతి, సీడీపీవో కె.శ్రీలత, సీడీపీఓ నిహారిక ఉన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

కూనవరం సీహెచ్‌సీలో
గుండెనొప్పి వైద్యానికి అందుబాటులో ఇంజక్షన్

ఆసుపత్రి సూపరింటెండెంట్ మహేష్‌బాబు



కూనవరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కూనవరం సీహెచ్‌సీలో గుండెనొప్పి వైద్యానికి రూ.50వేలు విలువైన ఇంజక్షన్ అందుబాటులో ఉందని ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.మహేష్‌బాబు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ గుండెనొప్పికి గురైన వారు వెంటనే కోతులగుట్ట ఆసుపత్రికి వస్తే ఈసీజీ పరీక్షలు నిర్వహిస్తామని, అవసరమైతే వారికి రూ.50 వేలు విలువైన టెనిస్ట్ ప్లేజ్ ఇంజక్షన్ ఇస్తామన్నారు. ఎటపాక మండలంలోని వ్యక్తికి గుండెనొప్పి రావడంతో కోతులగుట్ట సీహెచ్‌సీకి తీసుకు రాగా అతనికి టెనిస్ట్ ప్లేజ్ ఇంజక్షన్ ఇచ్చామన్నారు. దీంతో అతని ప్రాణాలు కాపాడగలిగామని తెలిపారు. కూనవరం, వరరామచంద్రపురం, ఎటపాక మండలాల ప్రజలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

వీధుల్లో మురుగునీరు.. ప్రజలు ఇబ్బందులు

మోతుగూడెం మేజర్ పంచాయతీ గిరిజన కాలనీలో రోడ్లపైకి మురుగునీరు



ఐటీడీఏ పీవో అపూర్వభరత్‌కి ఎస్టీకాలనీ డ్రైనేజీ సమస్య గురించి వివరిస్తున్న టీడీపీ ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు (ఫైల్‌ఫొటో)

మోతుగూడెం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మోతుగూడెం మేజర్ పంచాయతీలోని గిరిజన కాలనీలో ఇళ్లలోంచి మురుగునీరు వచ్చి రోడ్లపై నిలిచిపోతోంది. పందులు మురికిగుంటల్లో చేరి పరిసరాలను అధ్వానంగా మారుస్తున్నాయి. పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోవట్లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మురుగునీటిలో దోమలు చేరి మలేరియా, టైఫాయిడ్, అతిసార, కలరా వంటి వ్యాధులు సంభవిస్తే అనారోగ్యానికి గురయ్యే అవకాశాలున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ కార్యదర్శి జి.మోహన్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఇక్కడ డ్రైనేజీ సమస్య గతం నుంచీ ఉందన్నారు. తాను ఈమధ్యనే కార్యదర్శిగా వచ్చానని, సమస్య తన దృష్టికి కూడా వచ్చిందన్నారు. గతంలో సమస్యను ఐటీడీఏ పీవో అపూర్వభరత్‌కు వివరించగా ఆయన స్వయంగా వచ్చి చూశారన్నారు. ఎస్టీకాలనీ మొత్తం డ్రైనేజీ నిర్మాణానికి అంచనా వేయించామని, రూ.10లక్షలు అవుతుందని తెలిపారు. సమస్యను త్వరలో పరిష్కరిస్తామని కార్యదర్శి చెప్పారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

రంపచోడవరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టామని సబ్ కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీ తెలిపారు. గురువారం ఆమె కార్యాలయ చాంబరులో మాట్లాడుతూ రంపచోడవరం, చింతూరు డివిజన్లలో 12 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కోడ్ అమలు దృష్ట్యా సమావేశాల అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పి.రామకృష్ణ, పి.అనంత మోహన్, బుద్ధ వెంకన్నబాబు, కె.బాలకృష్ణ, చోళ్ల బొజ్జిరెడ్డి, బాలురెడ్డి, ఎం.శ్రీవాణి, సీహెచ్ సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడిన వస్తువులకు వేలం

రంపచోడవరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో వివిధ కేసుల్లో పట్టుబడిన వస్తువులకు శుక్రవారం స్థానిక జ్యుడిషియల్ కోర్టు ఆవరణలో వేలం నిర్వహిస్తున్నట్టు కోర్టు సూపరింటెండెంట్ నాగభూషణం గురువారం ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు ఆధార్ కార్డుతో ఉదయం 10లోగా హాజరుకావాలన్నారు.

మన్యం బంద్‌కు ఉద్యోగ సంఘం మద్దతు



ఆదివాసీ ఉద్యోగ సంఘం సమావేశంలో మాట్లాడుతున్న సంఘ నాయకుడు సోడె నారాయణ

చింతూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ జేఏసీ చేపట్టనున్న రాష్ట్ర వ్యాప్త మన్యం బంద్‌కు ఉద్యోగ జేఏసీ మద్దతు ఇస్తున్నట్టు ఉద్యోగ జేఏసీ జిల్లా నాయకుడు సోడె నారాయణ పేర్కొన్నారు. గురువారం చింతూరులో ఉద్యోగ జేఏసీ సంఘ సమావేశం జరిగింది. ఈసందర్భంగా నారాయణ మాట్లాడారు. స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఆదివాసీ చట్టాలపై చేసిన వ్యాఖ్యలు వెనక్కు తీసుకోవాలన్నారు. ఈనెల12న ఆదివాసీ జేఏసీ తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త మన్యం బంద్‌లో ప్రతి ఆదివాసీ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు సోడె బాలకృష్ణ, వీరభద్రం, ఆదివాసీ జేఏసీ చింతూరు డివిజను చైర్మన్ జల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలు తనిఖీ చేసిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్



పాఠశాల తరగతులు పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాఠశాలలను రంపచోడవరం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్ గురువారం తనిఖీ చేశారు. కాంప్లెక్సు రీ ఆర్గనైజేషన్‌లో భాగంగా తహశీల్దార్ అల్లు సత్యనారాయణ లాగరాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎంపీపీ పాఠశాలను, ఎంపీడీవో యాదగిరేశ్వరరావు చెరుకుంపాలెం ఎంపీపీ పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పరిశీలించారు. వారు ఇచ్చిన నివేదికల ప్రకారం ఆ పాఠశాలలను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్ గురువారం తనిఖీ చేపట్టారు. ఆయన వెంట తహశీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో యాదగిరేశ్వరరావు, ఎంఈవో సూర్యరెడ్డి ఉన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే పట్టభద్రులకు భరోసా

ప్రభుత్వ విప్ యనమల దివ్య



తేటగుంటలో ప్రచారం చేపడుతున్న ఎమ్మెల్యే దివ్య

తుని రూరల్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే పట్టుభద్రులకు భరోసా అని తుని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యనమల దివ్యస్పష్టం చేశారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతుగా తేటగుంటలో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, యువతతో సమావేశమైన ఆమె తొలి ప్రాధాన్యతా ఓటు పేరాబత్తుల రాజశేఖర్‌కు వేయాలని కోరారు. ఆమె వెంట టీడీపీ నాయకులు గజ్జి అప్పలరాజు, పప్పు నవీన్, కలగా శ్రీనుబాబు, చామంతి సత్తిబాబుతో పాటుగా మండలానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

నేటినుంచి ఏవీ నగరం వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు



ఏవీనగరం వేంకటేశ్వర స్వామివారి ఆలయం

తొండంగి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఏవీ నగరంలో కొలువైన శ్రీదేవి భూదేవి సమేత కల్యాణవేంకటేశ్వరుడి అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 7 నుంచి 9 వరకూ వివిధ కార్యక్రమాల నిర్వహణకు భారీఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలో అతిపెద్ద ఏకైక వేంకటేశ్వరుని ఆలయం కావడంతో ఇక్కడ జరిగే కార్యక్రమాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొంటారు. స్వామి మూర్తి 9 అడుగుల వరకూ ఉండి తిరుమల స్వామిని పోలిఉండడం, 108 సాలగ్రామాలతో కూడిన అరుదైన సాలగ్రామ మాల ధరించి ఉండడంతో భక్తులను ఆకర్షిస్తోంది. టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు, ఆయన సతీమణి విజయలక్ష్మి దగ్గరుండి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఉన్న షిరిడీ సాయిబాబా ఆలయంలో తెల్లవారుజామున కాకడ హారతి, గణపతిపూజ, అభిషేకం, అలంకరణపూజ, ఉదయం 9గంటలకు అభిషేకం అర్చన, సాయిసత్య వ్రతాలు, సరస్వతీ పూజ, మధ్యాహ్న హారతి, సాయంత్రం పల్లకి సేవ హారతి, పవళింపు సేవలతో కార్యక్రమాలు ముగియనున్నాయి. రెండో రోజు 8న శనివారం వేంకటేశ్వరుని ఆలయంలో సుప్రభాత సేవ, నవనీత హారతి, అష్టోత్తర శత కలస స్నపనం, ఏడు శనివారాల భక్తులతో హోమం, లక్ష తులసి పూజ, సత్యనారాయణ వ్రతాలు, మహానారాయణ హోమం, కల్యాణం, మంగళహారతి, మహాన్నదానం, రథోత్సవం, బంగారయ్యశర్మ ఉపన్యాసంతో రెండోరోజు కార్యక్రమాలు ముగియనున్నాయి. మూడోరోజు ఆదివారం స్వామివారి కోనేటిలో చక్రస్నానం వైభవంగా నిర్వహించనున్నారు. తుని ఎమ్మెల్యే యనమల దివ్య గోపీనాథ్ దంపతులతోపాటు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్, జిల్లాలోని పార్టీ ప్రముఖులు కార్యక్రమాలకు హాజరుకానున్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తులను గెలిపించండి

ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యప్రభ

శంఖవరం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబతుల రాజశేఖర్‌ను మొదటి ప్రాధాన్యతా ఓటుతో గెలిపించాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అభ్యర్థించారు.గురువారం కత్తిపూడి వర్తక సంఘం కళ్యాణ మండపంలో పట్టభద్రులతో సమావేశం ఏర్పాటు చేసి వారితో మాట్లాడారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పేరాబత్తుల రాజశేఖర్‌ను కూటమి అభ్యర్థిగా నామినేషన్ వేశామని, చంద్రబాబు ఆశయాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఎన్నికలో కూటమి విజయం సాధించాలని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా చంద్రబాబు ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు గొంపాకృష్ణ, సీనియర్ టీడీపీ నేతలు పర్వత సురేష్, పార్టీ మండల అధ్యక్షుడు బద్ది రామారావు, జనసేన నాయకులు మేడిశెట్టి సూర్యకిరణ్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు బచ్చల గంగ, కరణం సుబ్రహ్మణ్యం, గాబు సుభాష్ పాల్గొన్నారు.

17న ఇర్రిపాకలో శివకేశవ ప్రతిష్ఠ

పనులు పరిశీలించిన ఎమ్మెల్యే నెహ్రూ



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల

జగ్గంపేట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం ఇర్రిపాకలోని ఏలేరు నదీ తీరాన ఉన్న శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి, శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి కొలువైన శివకేశవుల ఆలయం వద్ద శివ కేశవ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గురువారం పండితులతో కలిసి టీటీడీ బోర్డు మెంబర్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది ఇదే నెలలో నిర్వహించిన కోటి పార్థివ శివలింగాల మహా రుద్రాభిషేకం నిర్వహించి ఏలేరు నదిలో నిక్షిప్తం చేసిన ప్రదేశంలో శ్రీశ్రీశ్రీ శివకేశవుల ప్రతిష్ఠ మహోత్సవం ఈనెల 12 నుంచి 17 వరకు నిర్వహిస్తున్నామని, 17న ఉదయం 11.55గంటలకు ప్రతిష్ఠ మహోత్సవం జరుగుతుందని తెలిపారు. పాణింగపల్లి సత్య పవన్‌కుమార్ ఆచార్యులు, నిరంజన ఆచార్యులు, కామేశ్వర శర్మ, బోదిరెడ్ల సుబ్బారావు, మండపాక అప్పన్నదొర, కాండ్రు శ్రీనివాసరావు, పణీంద్ర గోవింద్, గద్దెనాని, కానూరి కాసులు, త్రాసు పాల్గొన్నారు.

ముద్రగడను కలిసిన నేతలు

కిర్లంపూడి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి ముద్రగడ పద్మనాభరెడ్డి, ప్రత్తిపాడు వైసీపీ సమన్వయకర్త ముద్రగడ గిరిబాబును గురువారం కిర్లంపూడిలోని ఆయన నివాసంలో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ, రాజమహేంద్రవరం మాజీ ఎంపీ మార్గాని భరత్,మండపేట మున్సిపాల్టీ ఫ్లోర్ లీడర్ రెడ్డి రాధాకృష్ణ కలిశారు. ఇటీవల ముద్రగడ ఇంటిపై జరిగిన దాడికి సంబంధించి సంఘీభావం తెలిపారు. ఇటువంటి ఘటనలు జరగడం దురదృష్టకరమన్నారు. దీనిపై సీఎం, డిప్యూటీ సీఎం బాధ్యత వహించాలన్నారు.

ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రిలో గుండెపోటు ఇంజక్షన్‌లు సిద్ధం

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుకు తక్షణ చికిత్సలు అందజేసే స్టెమీరూంతోపాటు అత్యవసర ఇంజన్‌లు ప్రత్తిపాడు ప్రభుత్వాస్పత్రిలో అందుబాటులో ఉన్నాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య తెలిపారు. గురువారం గుండెపోటుకు గురైన మహిళకు అందుబాటులోకి వచ్చిన స్టెమీరూంలో అత్యవసర ఇంజక్షన్ చేసి వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ గుండెపోటుకు గురైన వ్యక్తులు గోల్డెన్ అవర్(గంటలోపు) ఆస్పత్రికి తరలించడం ద్వారా వారికి రూ.40వేల విలువ చేసే ఇంజక్షన్ ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రత్తిపాడు వైద్య విధాన పరిషత్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బెల్లపు ఊట ధ్వంసం

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిబ్బంది గురువారం మండపం గ్రామంలో నాటుసారా బట్టీలపై దాడులు చేసి 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్, ఎస్ఐ వంశీరామ్ సిబ్బంది పాల్గొన్నారు.

క్వారీకి పర్యావరణ అనుమతులపై ప్రజాభిప్రాయసేకరణ



పర్యావరణ అనుమతులపై ప్రజాభిప్రాయసేకరణ చేస్తున్న అధికారులు

రౌతులపూడి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రౌతులపూడి మండలం రాఘవ పట్నం గ్రామ పంచాయతీ పరిధిలో ఏఎంఆర్ ఇండియా లిమిటెడ్ రోడ్ మెటల్, బ్యాలస్ట్ క్వారీకి పర్యా వరణ అనుమతులపై గురువారం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఏఎంఆర్ ఇండియా లిమిటెడ్ సర్వే నెంబర్ 158లో 6.120 హెక్టార్ల విస్తీర్ణంలో పది సవంత్సరాలు లీజుకు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుంది. లీజు అనుమతులపై కాకినాడ జిల్లా డీఆర్వో జె.వెంకటరావు, ఎన్విరాన్‌మెంట్ ఈఈ ఎంబీఎస్ శంకరావు క్వారీ సమీపంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. గ్రామస్తులు మాట్లాడుతూ స్థానికంగా ఉద్యోగాలు కల్పించాలని తాగునీటి, విద్య, వైద్యం తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. పర్యావరణవేత్తలు రహదారికి ఇరువైలా చెట్లను పెంచాలన్నారు. ప్రజలు ఇబ్బంది పడకుండా గ్రామాలను దత్తత తీసుకోవాలన్నారు. మెడికల్ క్యాంప్‌లు నిర్వహించాలన్నారు. డీఆర్వో వెంకటరావు మాట్లాడుతూ ఈ కంపెనీ ద్వారా 30మంది ప్రత్యక్షంగాను, 50 మందికి పరోక్షంగాను ఉపాధి కల్పిస్తామన్నారు. గ్రామంలో ప్రజలు కోరినట్టే అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. గిరిజనులకు పట్టాలు ఉండడంవల్ల ఇబ్బందులు పడుతున్నారని క్వారి అనుమతులకు సీపీఐ(ఎంఎల్) వ్యతిరేకమని తమ అభిప్రాయాన్ని పార్టీ మండల కార్యదర్శి సామిరెడ్డి నారాయణమూర్తి తెలిపారు. ప్రత్తిపాడుకు చెందిన లాయర్ పిల్లి బలరాముడు మాట్లాడుతూ ప్రజా వ్యతిరేకంగా ప్రజాప్రాయసేకరణ జరుగుతున్నందున నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రస్థాయి బహుమతి సాధించిన గైడ్ టీచర్లకు సన్మానం

తొండంగి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): బెండపూడి విద్యార్థి బలరాం శివ రూపొందించిన సోలార్ ప్యానల్స్ ఫర్ క్రాప్ ప్రాజెక్టు రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన నేపథ్యం లో దానికి గైడ్ టీచర్లుగా వ్యవహరించిన ఉపాధ్యాయులను గురువారం ఘనంగా సన్మానించారు. రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి పొందడంతోపాటు దక్షిణ భారత స్థాయిపోటీలో కన్సొలేషన్ బహుమతి సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు నాగం కృష్ణమూర్తి తెలిపారు. దీనికి కారణమైన ఉపాధ్యాయులను సన్మానించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఉపాధ్యాయుడు అరిగెల వాసు పాల్గొన్నారు.

కుమ్మరిలోవలో పోలవరం నిర్వాసిత రైతుల ఆందోళన

పరిహారం ఇచ్చిన తర్వాత పనులు మొదలు పెట్టాలని డిమాండ్



కుమ్మరిలోవ వద్ద పోలవరం పనులు అడ్డుకుని ఆందోళన చేస్తున్న రైతులు

తుని రూరల్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలం కుమ్మరిలోవ గ్రామంలో పోలవరం నిర్వాసిత రైతులు చేపట్టిన నిరసనతో ఉద్రిక్తత పరిస్థితులు చోటుచేసుకున్నాయి. పోలవరం ఎడవ కాలువ నిర్మాణ పనులు అధికారులు చేపడుతుండగా నిర్వాసిత రైతులు పనులను అడ్డుకున్నారు. 2009లో పోలవరం నిర్మాణానికి భూ సర్వే నిర్వహించి రైతుల అభిప్రాయాలు తీసుకోలేదని, రైతులకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా కోట్ల రూపాయలు విలువైన భూములకు కేవలం ఎకరానికి రూ.1,87,580 దర నిర్ణయించి భూములు లాక్కోవాలని చూస్తే సహించేది లేదంటూ అధికారులను నిలదీశారు. అప్పటి అధికారులు రైతులకు సమాచారం ఇవ్వకుండా ఇష్టానుసారంగా ఆర్డర్ పాస్ చేసి కోర్టులో డబ్బులు డిపాజిట్ చేసి తమ భూములను బలవంతంగా తీసుకునే ప్రయత్నం చేస్తున్నారని, ప్రభుత్వం తీరుతో తాము తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని వాపోయారు. తాము పోలవరం కాలువకు వ్యతిరేకం కాదని, పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికి భూములు ఇచ్చేందుకు తామంతా సానుకూలమేనని అన్నారు. తప్పనిసరిగా 2013 భూసేకరణ చట్ట ప్రకారం సప్లిమెంటరీ అర్డరు పాస్ చేసి రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నట్లు తెలిపారు. తమకు న్యాయం జరిగే వరకు ఈప్రాంతంలో పనులు చేపడితే ఆపుతామని హెచ్చరిస్తూ పనులు చేస్తున్న మిషన్‌ను వెనక్కి పంపించారు. ఎస్టీసీ జాగిరాజుకు, పోలవరం ఏఈడీకు స్థానిక టీడీపీ నాయకులు జక్కన్న రామనాయుడు, పోతల రమణ రైతులతో కలిసి వినతిపత్రం అందజేశారు.

ఉప్పాడ-1 వీఆర్వో రాంబాబు మృతి

కొత్తపల్లి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఉప్పాడ-1 వీఆర్వో పోసపల్లి రాంబాబు (48) గురువారం మృతి చెందారు. ఇటీవల ఆయనకు కిడ్నీ సంబంధిత వ్యాధి రావడంతో ఆపరేషన్ చేసి తొలగించారని సహచరఉద్యోగులు తెలిపారు.

నేటినుంచి కొండరాజులబాబు జాతర

ఏలేశ్వరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని రమణయ్యపేట గ్రామంలో కొండరాజులబాబు జాతరకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నేటి నుంచి ఈనెల 20 వరకు కొండరాజులబాబు జాతర నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవంలో వినోద కార్యక్రమాలు, డప్పు మేళం, డీజే, కోనారి చువారి డ్యాన్స్, అజయ్ ఈవెంట్స్, కొమ్మలాట, లక్క గుర్రం, గరగ నృత్యం, కోలాటం, ఆర్కెస్ట్రా తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మూడువారాలపాటు జరిగే జాతరకు వచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకోవడానికి ఆలయ ప్రాంగణంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలియజేశారు.

నేడు ఫిజియోథెరపీపై అవగాహన

గండేపల్లి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉద్యోగులు, సచివాలయ సిబ్బందికి నిజాం కాలేజీ ఆఫ్ ఫిజియోథెరపీ ఆధ్వర్యంలో ఫిజియోథెరపీపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని మండల పరిషత్ అధికారులు తెలిపారు. ఫిజియోథెరపీపై శిక్షణ కూడా నిర్వహిస్తామన్నారు.

వెబ్ డెవలప్‌మెంట్ అండ్ డిజైన్ థింకింగ్ వర్క్‌షాప్

గండేపల్లి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం తరుపున బ్రెయిన్ ఓ విజన్ సహకారంతో గురువారం వెబ్ డెవలప్‌మెంట్ అండ్ డిజైన్ థింకింగ్ ఫర్ ఎస్డిజిపై మూడురోజుల వర్క్‌షాప్ ప్రారంభమైందని కళాశాల చైర్మన్ డాక్టర్ పి.కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు వారి నైపుణ్యాలను, సృజనాత్మకతను పెంపొందించుకోవడానికి అద్భుతమైన అవకాశమని తెలిపారు.

ఉపాధి పనుల పరిశీలన

గండేపల్లి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మురారిలో జాతీయ ఉపాధి హామీ పథకం పనులను గురువారం ఎంపీడీవో నాతి బుజ్జి పరిశీలించారు. చెరువు పనికి వచ్చిన వేతనదారుల మస్తర్లు తనిఖీ చేశారు. కూలీలకు కొలతల ప్రకారం పనిచేసి రూ.300 వేతనం పొందాలన్నారు. వంద రోజులు పని పూర్తి చేసుకోవాలన్నారు. గ్రామంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శిరీష, ఈసీ రమేష్, టీఏ శ్రీనుబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష

స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీవో నాతి బుజ్జి ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని, వారికి వంద రోజుల పనికల్పించాలని ఆదేశించారు. ప్రతి కూలీకి రూ.300 వచ్చేలా పని చేయించాలన్నారు. ఏపీవో గంగాభవానీ, ఈసీ రమేష్, టీఏ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

నేడు కాట్రావులపల్లిలో విద్యుత్ సరఫరా నిలుపుదల

జగ్గంపేట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కాట్రావులపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని నంది సెంటర్ ఫీడర్‌లో శుక్రవారం చెట్టుకొమ్మలు తొలగింపు కారణంగా మండలంలోని కాట్రావులపల్లి, యర్రంపాలెం గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ ఏఈ బి.వీరభద్రరావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

విద్యావిధానంపై అవగాహన

తొండంగి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పెరుమాళ్లపురం డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో గురువారం నూతన విద్యావిధానం పై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వ సూచన మేరకు ప్రైవేటు జూనియర్ కళాశాలలకు వెళ్లి ప్రభుత్వ కళాశాలలవల్ల జరిగే లబ్ధి, అందుతున్న సౌకర్యాలు, అందుబాటులో ఉన్న కోర్సులు తదితర వివరాలను ప్రిన్సిపాల్ మెహర్ వివరించారు. ప్రభుత్వ కళాశాలల్లో చేరికకు ఆహ్వానించారు.